www.prajanaava.in

ప్రజానావ

Telugu Daily

ప్రతి అక్షరం జనం కోసం..

పేజీలు : 08 | వెల రూ.5.00

Published from: Hyderabad, Rangareddy, Karimnagar Circulated to: Warangal, Khammam, Nalgonda, Mahabubnagar, Nizamabad

హైదరాబాద్ | సంపుటి 01 | సంచిక: 65 | మంగళవారం | 13 అక్టోబర్, 2026

కోర్టును రాజకీయాల్లోకి లాగొద్దు



- ఓట్ల చోరీపై విపక్ష నేతలకు సీజేఐ స్పష్టీకరణ
- ఖర్గే, రాహుల్ గాంధీకి లేఖ ద్వారా సమాధానం
- డిమాండ్లపై న్యాయస్థానంలో పిటిషన్ వేయాలని సూచన

2



రియాద్ విమానాశ్రయంపై దాడి!

- క్షిపణులతో భీకరదాడికి దిగిన హూతీలు
- 12మంది మృతి.. 300 మందికిపైగా గాయాలు
- విమాన సర్వీసులు రద్దు
- విమానాశ్రయాలకు వెళ్లొద్దని పౌరులకు పలు దేశాల హెచ్చరిక

2

సౌదీ అరేబియాలోని రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై క్షిపణి దాడి కలకలం రేపింది. ఈ ఘటనలో 12 మంది మరణించగా, 300 మందికిపైగా గాయపడ్డారు. కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దేశీయ విమానాల రాకపోకలకు ఉపయోగించే 3, 4 టెర్మినళ్ల సముదాయంపై శనివారం క్షిపణి పడినట్లు ప్రాంతీయ అధికారి తెలిపారు. దీంతో విమానాశ్రయ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసి, పలు విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు.



ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భారీగా ఓట్ల తొలగింపు, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రతిపక్ష నేతలు న్యాయపోరాటానికి దిగారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలు పార్టీల నేతలు సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఓట్ల చోరీ ఆరోపణలపై న్యాయం చేయాలని కోరుతూ ఈ పిటిషన్ వేసినట్లు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగతా రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ ప్రసాద్ యాదవ్, ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్) నేత సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, సీపీఐ నేత డి.రాజా, జేఎంఎం ఎంపీ మహువా మాఝీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.బేబీ, ఐయూఎంఎల్ నేత ఈటీ మహమ్మద్ బషీర్ తదితరులు పిటిషన్ దాఖలు చేసిన వారిలో ఉన్నారు.



- మార్చ్ ఫర్ డెమోక్రసీ

ఓట్ల చోరీపై న్యాయం చేయండి

- సర్‌పై సుప్రీంకోర్టును ఆశ్రయించిన విపక్ష నేతలు
- ఓట్ల తొలగింపు, అక్రమాలపై రాహుల్, ఖర్గే సహా పలువురి పిటిషన్
- సీజేఐకి వినతిపత్రం అందించేందుకు యత్నం

2



ఓట్ల తొలగింపునకు బీజేపీ కుట్రలు

2


ఈడీ, ఐటీ తర్వాత ఎస్ఐఆర్ అస్త్రం ప్రయోగం

- సీఈసీ జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలి
- ప్రజాస్వామ్య పరిరక్షణ ఉద్యమంలో అందరూ భాగస్వాములు కావాలి
- చలో ఢిల్లీ విపక్ష ర్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

- స్థూల ఆర్థిక స్థిరీకరణపై పరిశోధనలకు పురస్కారం
- అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్‌లకు ఎంపిక
- ఆర్థిక వ్యవస్థలో ఒడుదొడుకుల నియంత్రణపై అధ్యయనానికి గుర్తింపు



ఆర్థిక శాస్త్రంలో 2026 సంవత్సరానికి నోబెల్ పురస్కారాన్ని ఇద్దరు అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్ దక్కించుకున్నారు. స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులపై చేసిన పరిశోధనలకు గుర్తింపుగా రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ పురస్కారాన్ని ప్రకటించింది.

2



ఫార్ములా–ఈ కేసు నుంచి తప్పించండి

- ఏసీబీ కోర్టులో కేటీఆర్ డిశ్చార్జ్ పిటిషన్
- చార్జిషీట్‌లో ఏ–1గా పేర్కొనడంపై సవాల్
- కౌంటర్ దాఖలు చేయాలని ఏసీబీకి కోర్టు ఆదేశం..
- ఈ నెల 30కి విచారణ వాయిదా

2



రేవంత్ వైఫల్యంతోనే విద్యుత్ కోతలు

- రైతులను ఇబ్బంది పెడుతున్న ప్రభుత్వం
- ప్రజల తాగునీటి కంటే లిక్కర్ కంపెనీలే ముఖ్యమా?: హరీశ్‌రావు

కాంగ్రెస్‌కు దిశానిర్దేశం లేదు

- నిరసన తెలిపే హక్కుంది.. రాజ్యాంగ సంస్థలను దూషించడం సరికాదు
- ఏడాదిలో 200 రోజులు సెలవులు తీసుకోని నాయకత్వం కావాలా?
- కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు



న్యూఢిల్లీ: ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్‌కు వ్యతిరేకంగా కాంగ్రెస్ సహా ఇండియా కూటమి నేతలు చేపట్టిన నిరసనపై కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, అయితే రాజ్యాంగ సంస్థలను బహిరంగంగా దూషించడం సమర్థనీయం కాదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ దిశానిర్దేశం లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల్లో మెరుగైన ఫలితాలు సాధించాలంటే బాధ్య తాయుతంగా పనిచేసే నాయకత్వం ఆ పార్టీకి అవసరమని పేర్కొన్నారు. సోమవారం తరువాయి 2లో..



2

జంతర్ మంతర్‌లో ఇక నిరసనలకు నో!

- డీనోటిఫై చేసినఢిల్లీ పోలీసులు • ధర్నాలకు ప్రత్యామ్నాయ వేదికలుగా మూడు ప్రాంతాలు

ఓట్ల చోరీపై న్యాయం చేయండి

న్యూఢిల్లీ: న్యూఢిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియలో భారీగా ఓట్ల తొలగింపు, అక్రమాలు జరిగాయన్న ఆరోపణలపై ప్రతిపక్ష నేతలు న్యాయపోరాటానికి దిగారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సహా పలు పార్టీల నేతలు సోమవారం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఓట్ల చోరీ ఆరోపణలపై న్యాయం చేయాలని కోరుతూ ఈ పిటిషన్ వేసినట్లు సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో పేర్కొన్నారు. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ సాగతా రాయ్, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆర్జేడీ నేత తేజస్వీ ప్రసాద్ యాదవ్, ఎన్సీపీ (శరద్‌చంద్ర పవార్) నేత సుప్రియా సూలే, శివసేన (యూబీటీ) నేత సంజయ్ రౌత్, సీపీఐ నేత డి.రాజా, జేఎంఎం ఎంపీ మహువా మాఝీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఏ.బేబీ, ఐయూఎంఎల్ నేత ఈటీ మహమ్మద్ బషీర్ తదితరులు పిటిషన్ దాఖలు చేసిన వారిలో ఉన్నారు.



సుప్రీంకోర్టు వరకు ర్యాలీ

ఓట్ల చోరీ ఆరోపణలు, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా విపక్ష నేతలు, ఎంపీలు, వందలాది మంది కార్యకర్తలు సోమవారం 'మార్చ్ ఫర్ డెమోక్రసీ' పేరుతో ర్యాలీ నిర్వహించారు. సుప్రీంకోర్టు దిశగా సాగిన ఈ నిరసనలో రాహుల్ గాంధీ, ఖర్గేతో పాటు కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ వాద్రా, డీ రాజా, ఎంఏ బేబీ, తేజస్వీ యాదవ్, సుప్రియా సూలే, సంజయ్ రౌత్, సీపీఐ (ఎంఎల్) నేత దీపాంకర్ భట్టాచార్య తదితరులు పాల్గొన్నారు.

భేటీకి సీజేఐ నిరాకరణ?

ఓట్ల చోరీ ఆరోపణలపై రాహుల్ గాంధీని కలిసేందుకు సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ గతంలో నిరాకరించినట్లు ఆదివారం వార్తలు వెలువడ్డాయి. ఈ అంశాలకు సంబంధించిన కేసులు ఇప్పటికే న్యాయస్థానం విచారణలో ఉన్నందున భేటీ సాధ్యం కాదని ఆయన పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు వెల్లడించాయి. అయితే, సోమవారం సాయంత్రం 4 నుంచి 5 గంటల మధ్య సీజేఐని కలిసి వినతిపత్రం అందించేందుకు రాహుల్ గాంధీ, ఖర్గే లేఖ రాశారు. ఓట్ల చోరీని అరికట్టడం, ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీనామా, ఎస్ఐఆర్ ప్రక్రియ నిలిపివేత, పేపర్ బ్యాలెట్ విధానాన్ని తిరిగి అమలు చేయడం వంటి డిమాండ్లను వినతి పత్రంలో ప్రస్తావించాలని వారు కోరారు.

జంతర్ మంతర్‌లో ఇక నిరసనలకు నో!

న్యూఢిల్లీ: దేశ రాజధానిలో నిరసన ప్రదర్శనలకు దశాబ్దాలుగా వేదికగా నిలుస్తున్న జంతర్ మంతర్‌కు ఢిల్లీ పోలీసులు తెరదించారు. ఇకపై అక్కడ ఆందోళనలు, ధర్నాలకు అనుమతి ఉండదని ప్రకటించారు. ఈ మేరకు జంతర్ మంతర్‌ను నిరసన వేదికల జాబితా నుంచి తొలగిస్తూ నిర్ణయం తీసుకున్నారు. దానికి బదులుగా రామ్‌లీలా గ్రౌండ్, బురారీ గ్రౌండ్, సీబీడీ గ్రౌండ్‌లను ప్రత్యామ్నాయ వేదికలుగా సూచించారు. కేంద్ర హోంమంత్రిత్వ శాఖ ఇటీవల ఏర్పాటు చేసిన కమిటీ సిఫార్సుల మేరకు ఈ నిర్ణయం తీసుకున్నట్లుఢిల్లీ పోలీసు కమిషనర్ అనురాగ్ కుమార్ వెల్లడించారు. ఆందోళనలు, ధర్నాల నిర్వహణకు అనువైన ప్రత్యామ్నాయ ప్రాంతాలను గుర్తించేందుకు ఈ కమిటీని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కొత్త వేదికల్లో నిరసనలు నిర్వహించేందుకు అనుసరించాల్సిన విధివిధానాలను త్వరలోనే ప్రకటిస్తామని పేర్కొన్నారు.

నిర్ణయంపై సీజేపీ అభ్యంతరం

జంతర్ మంతర్‌ను నిరసన వేదికగా తొలగించడంపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) అభ్యంతరం వ్యక్తం చేసింది. ప్రజలతో సంప్రదించకుండా ఇలాంటి నిర్ణయం తీసుకోవడం ఏకపక్షమని పార్టీ కన్వీనర్ సౌరవ్ దాస్ 'ఎక్స్' వేదికగా విమర్శించారు. జంతర్ మంతర్ దేశ ప్రజల ఆస్తి అని, శాంతియుతంగా నిరసన తెలిపే హక్కుపై ఈ నిర్ణయం ప్రభావం చూపుతుందని పేర్కొన్నారు.

ఆర్థిక శాస్త్రంలో ఇద్దరికి నోబెల్

స్టాక్‌హోమ్: ఆర్థిక శాస్త్రంలో 2026 సంవత్సరానికి నోబెల్ పురస్కారాన్ని ఇద్దరు అమెరికా ఆర్థికవేత్తలు రాబర్ట్ ఇ. హాల్, మైఖేల్ వుడ్‌ఫోర్డ్ దక్కించుకున్నారు. స్థూల ఆర్థిక స్థిరీకరణకు సూక్ష్మ ఆర్థిక పునాదులపై చేసిన పరిశోధనలకు గుర్తింపుగా రాయల్ స్వీడిష్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఈ పురస్కారాన్ని ప్రకటించింది. వైద్య శాస్త్ర విభాగంతో ప్రారంభమైన ఈ ఏడాది నోబెల్ పురస్కారాల ప్రకటనలు ఆర్థిక శాస్త్ర విభాగంతో ముగిశాయి. కాలిఫోర్నియాకు చెందిన రాబర్ట్ ఇ. హాల్ 1967లో మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఐటీ) నుంచి పీహెచ్‌డీ పొందారు. ప్రస్తుతం స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. మసాచుసెట్స్‌కు చెందిన మైఖేల్ వుడ్‌ఫోర్డ్ 1983లో ఎంఐటీ నుంచి పీహెచ్‌డీ పూర్తి చేశారు. ప్రస్తుతం కొలంబియా విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్‌గా ఉన్నారు. వీరిద్దరి పరిశోధనలు స్థూల ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకునే మార్పులను అర్థం చేసుకోవడానికి, వాటిని నియంత్రించేందుకు ప్రభుత్వాలు, కేంద్ర బ్యాంకులు చేపట్టే విధానాల ప్రభావాన్ని విశ్లేషించడానికి దోహదపడతాయి. సరైన సమయంలో అమలు చేసే ఆర్థిక, ద్రవ్య విధానాలు ఆర్థిక వ్యవస్థలోని హెచ్చుతగ్గులను తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయని వారి అధ్యయనాలు వివరిస్తాయి.

రేవంత్ వైఫల్యంతోనే విద్యుత్ కోతలు

ప్రజానావ, హైదరాబాద్: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వైఫల్యం వల్లే రాష్ట్రంలో విద్యుత్ కోతలు ఏర్పడ్డాయని మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ సాగునీరు, తాగునీటి నిర్వహణలో ప్రభుత్వ తీరుపై మండిపడ్డారు.రైతుల కంటే ప్రభుత్వానికి ముఖ్యమైన అంశం ఏముంటుందని హరీశ్‌రావు ప్రశ్నించారు. దేవాదుల, కల్వకుర్తి ప్రాజెక్టుల ద్వారా ముందుగానే నీటిని ఎత్తిపోసి నిల్వ చేసుకుని ఉంటే కరవు పరిస్థితులు ఏర్పడేవి కావని అన్నారు. ఎల్‌నినో ప్రభావం ఉంటుందని ముందే తెలిసినా ప్రభుత్వం అప్రమత్తం కాలేదని విమర్శించారు.

సింగూరుపై నిర్లక్ష్యమెందుకు?

సింగూరు ప్రాజెక్టుకు మరమ్మతులు చేస్తామంటూ 29 టీఎంసీల నీటిని ఖాళీ చేశారని హరీశ్‌రావు ఆరోపించారు. అయితే, పనులు చేపట్టకుండా ప్రాజెక్టును నిర్లక్ష్యంగా పదిలేశారని విమర్శించారు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, కామారెడ్డి, సంగారెడ్డి, మెదక్ జిల్లాలకు తాగునీరు ఎలా అందిస్తారని ప్రశ్నించారు. కోట్లాది మందికి తాగునీటిని అందించే ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని నిలదీశారు.ప్రస్తుతం సింగూరు ప్రాజెక్టులో మూడు టీఎంసీల నీరు మాత్రమే ఉన్నప్పటికీ బీరు తయారీ పరిశ్రమలకు నీటిని సరఫరా చేస్తున్నారని ఆరోపించారు. ప్రజల తాగునీటి అవసరాల కంటే బీరు ఫ్యాక్టరీలపైనే ప్రభుత్వానికి ఎక్కువ ప్రేమ ఉందని విమర్శించారు.

లిక్కర్ కంపెనీలకు నీళ్లిస్తారా?

లిక్కర్ కంపెనీలకు నీటి కొరత రాకూడదని ఆబ్కారీ మంత్రి చెబుతున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు. కోట్లాది మంది ప్రజల తాగునీటి అవసరాలను పక్కనపెట్టి బీరు కంపెనీలకు నీటిని సరఫరా చేయడంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజల ప్రయోజనాల కంటే మద్యం కంపెనీల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తున్నారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తారు.

కాంగ్రెస్‌కు దిశానిర్దేశం లేదు

(మొదటిపేజీ తరువాయి)

సామాజిక మాధ్యమం 'ఎక్స్' వేదికగా రిజిజు ఈ వ్యాఖ్యలు చేశారు. నిరసన తెలిపే హక్కును ఎవరూ ప్రశ్నించలేరని, అయితే రాజ్యాంగ సంస్థలను కించపరచడం సరికాదని పేర్కొన్నారు. కాంగ్రెస్ తన పనితీరును మెరుగుపరుచుకోవాలంటే ఏడాదిలో 200 రోజులు సెలవులు తీసుకోకుండా పార్టీ కోసం అంకితభావంతో పనిచేసే నాయకుడు ఉండాలని వ్యాఖ్యానించారు. రిజిజు చేసిన ఈ వ్యాఖ్యలు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీని ఉద్దేశించినవేనని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. రాహుల్ తరచూ విదేశీ పర్యటనలకు వెళ్తారంటూ బీజేపీ గతంలో పలుమార్లు విమర్శలు చేసిన నేపథ్యంలో తాజా వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

ఆరు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు

న్యూఢిల్లీ: దేశంలోని 6 రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సోమవారం రోజు నిర్ణయం తీసుకున్నారు. తమిళనాడు, కేరళ, సిక్కిం రాష్ట్రాల గవర్నర్లను బదిలీ చేయడంతో పాటుగా ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్ రాష్ట్రాలకు కొత్త గవర్నర్లను నియమించారు. సంబంధిత గవర్నర్లు బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఈ నియామకాలు అమల్లోకి వస్తాయని రాష్ట్రపతి భవన్ ఒక ప్రకటనలో తెలిపింది. తాజా మార్పుల్లో భాగంగా కేరళ గవర్నర్‌గా ఉన్న రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను తమిళనాడుకు మారుస్తూ అక్కడ పూర్తి బాధ్యతలు అప్పగించారు. సిక్కిం గవర్నర్‌గా ఉన్నటువంటి ఓం ప్రకాశ్ మాథుర్ కేరళంకు బదిలీ అయ్యారు. సిక్కిం గవర్నర్‌గా బీజేపీ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ రాజ్యసభ సభ్యుడు దుష్యంత్ గౌతమ్ నియమితులయ్యారు. రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఈ ఏడాది మార్చి నుంచి తమిళనాడు గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అప్పటి గవర్నర్ ఆర్.ఎన్. రవిని పశ్చిమ్ బెంగాల్‌కు బదిలీ చేయడంతో అర్లేకర్‌కు ఈ బాధ్యతలు అప్పగించారు. ఈ సమయంలో తమిళనాడు ముఖ్యమంత్రి సి. జోసెఫ్ విజయ్‌తో ప్రమాణ స్వీకారం కూడా ఈయనే చేయించారు. ఇప్పుడు పూర్తి స్థాయిలో బాధ్యతలు స్వీకరించనున్నారు. ఇక గోవా అసెంబ్లీకి మాజీ స్పీకర్ అయిన అర్లేకర్ గతంలో హిమాచల్ ప్రదేశ్, బిహార్ రాష్ట్రాలకు కూడా గవర్నర్‌గా పనిచేశారు. ఇక ఓం ప్రకాశ్ మాథుర్ విషయానికి వస్తే 2024 జులైలో ఈయన సిక్కిం గవర్నర్‌గా బాధ్యతలు చేపట్టారు. రాజస్థాన్‌కు చెందిన బీజేపీ సీనియర్ నాయకుడైన మాథుర్ గతంలో రాజ్యసభ సభ్యుడిగా కూడా పనిచేశారు. ఇప్పుడు కేరళం గవర్నర్‌గా అర్లేకర్ స్థానంలో బాధ్యతలు చేపట్టనున్నారు.

ఒడిశా గవర్నర్‌గా బ్రిజ్ మోహన్ రామ్

ఒడిశా కొత్త గవర్నర్‌గా బ్రిజ్ మోహన్ రామ్ నియమితులయ్యారు. పాలమూ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన ఈ మాజీ ఎంపీ కంభంపాటి హరిబాబు స్థానంలో బాధ్యతలు చేపట్టబోతున్నారు. కంభంపాటి హరిబాబు 2025 జనవరిలో ఒడిశా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఒడిశా గవర్నర్‌గా నియమితులైన బ్రిజ్ మోహన్ రామ్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝీ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ మేరకు ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఒడిశా అభివృద్ధి కోసం తాము చేస్తున్న సమష్టి కృషిలో ఆయన మార్గదర్శకత్వం, మద్దతు కోసం ఎదురుచూస్తున్నట్లు వెల్లడించారు. ఆయన పదవీ కాలం ఒడిశా ప్రజల సేవా స్ఫూర్తిని, ఆకాంక్షలను మరింత బలోపేతం చేయాలని ఆశిస్తున్నట్లు తెలిపారు. గవర్నర్ బ్రిజ్ మోహన్ రామ్ పదవీ కాలం విజయవంతంగా, సంతృప్తికరంగా సాగాలని ఆశాభావం వ్యక్తం చేశారు.డ కర్ణాటక గవర్నర్‌గా డాక్టర్ సుధా యాదవ్ నియమితులయ్యారు. మహేంద్రగఢ్ నుంచి గతంలో ఎంపీగా పనిచేసిన ఆమె నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ (వెనుకబడిన తరగతుల జాతీయ కమిషన్) మాజీ సభ్యురాలు కూడా. థావర్ చంద్ గహ్లోత్ స్థానంలో ఆమె కర్ణాటక గవర్నర్‌గా విధులు నిర్వర్తించనున్నారు. ఇక తాజా నియామకంతో ఆమె కర్ణాటక రెండో మహిళా గవర్నర్‌గా నిలవనున్నారు. అంతకుముందు 1999 నుంచి 2002 వరకు వీఎస్ రమాదేవి కర్ణాటక తొలి మహిళా గవర్నర్‌గా పనిచేశారు. మధ్యప్రదేశ్‌లోని బాలాఘాట్ నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించిన మాజీ ఎంపీ డాక్టర్ ఢాల్ సింగ్ బిసేన్ ఉత్తరాఖండ్ గవర్నర్‌గా నియమితులయ్యారు. ఆయన రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ గుర్మీత్ సింగ్ స్థానంలో బాధ్యతలు నిర్వర్తించనున్నారు. సిక్కిం గవర్నర్‌గా గతంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన, రాజ్యసభ మాజీ ఎంపీ దుష్యంత్ గౌతమ్ నియమితులయ్యారు. తాజా నిర్ణయంతో ఇక్కడ తమిళనాడు, సిక్కిం, కేరళం గవర్నర్ల బదిలీలు జరగ్గా, ఒడిశా, కర్ణాటక, ఉత్తరాఖండ్‌కు కొత్త గవర్నర్లు నియమితులయ్యారు. మొత్తం 6 రాష్ట్రాల్లో గవర్నర్ బాధ్యతల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఇక కంభంపాటి హరిబాబు, థావర్‌చంద్ గహ్లోత్, గుర్మీత్ సింగ్‌లకు ప్రస్తుతానికి ఎలాంటి కొత్త బాధ్యతలు కేటాయించలేదు.

కోర్టును రాజకీయాల్లోకి లాగొద్దు

న్యూఢిల్లీ: 'ఓట్ల చోరీ' అంశంపై వినతిపత్రం సమర్పించేందుకు సోమవారం సమయం ఇవ్వాలన్న కాంగ్రెస్ నేతృత్వంలోని ఇండియా కూటమి విజ్ఞప్తిని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ తిరస్కరించారు. ఈ మేరకు కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఈ–మెయిల్ ద్వారా లేఖ పంపినట్లు వెల్లడించారు. ఎన్నికల సంఘం ప్రధాన కమిషనర్ (సీఈసీ)కు సంబంధించి విపక్షాలు లేవనెత్తాలనుకుంటున్న అంశాలపై ఇప్పటికే సుప్రీంకోర్టులో విచారణ పెండింగ్‌లో ఉందని స్పష్టం చేశారు. ఒక అంశంపై న్యాయస్థానంలో విచారణ కొనసాగుతున్నప్పుడు దానిపై ఇతరులతో చర్చించడం రాజ్యాంగంలోని అధికార విభజన సూత్రానికి, న్యాయపరమైన ఔచిత్యానికి విరుద్ధమని సీజేఐ పేర్కొన్నారు. విపక్ష నేతలు తమ లేఖలో ప్రస్తావించిన అంశాలను పరిష్కరించేందుకు రాజ్యాంగం ప్రకారం సుప్రీంకోర్టుకు పాలనాపరమైన అధికారాలు లేవని వివరించారు. అందుకే వారి విజ్ఞప్తిని అంగీకరించలేదని తెలిపారు. అయితే, రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద తమకు ఉన్న అధికార పరిధిని వినియోగించుకుంటూ పౌరులపై ప్రభావం చూపే అంశాల్లోని ప్రధాన సమస్యలను పరిశీలించాల్సిన బాధ్యత న్యాయస్థానానికి ఉందన్నారు. విపక్ష నేతలు తమ డిమాండ్లపై న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయవచ్చని సూచించారు. సుప్రీం తలుపులు ఎల్లప్పుడూ అందరికీ తెరిచే ఉంటాయని పేర్కొంటూనే, న్యాయ స్థానాన్ని రాజకీయాల్లోకి లాగేందుకు ప్రయత్నించవద్దని స్పష్టం చేశారు.

కలుషిత జలాలతో ఆరోగ్యానికి ముప్పు

జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) సమావేశంలో 'నీరు–జీవన అమృతం' అంశంపై మాట్లాడిన సీజేఐ.. కలుషిత నీటి కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆందోళన వ్యక్తం చేశారు. కలుషిత జలాలు ప్రజల ఆరోగ్యానికి తీవ్ర ముప్పుగా మారుతున్నాయని పేర్కొన్నారు. పౌరుల రాజ్యాంగ హక్కులను పరిరక్షించడంలో స్వచ్ఛమైన తాగునీటి లభ్యత కీలకమని తెలిపారు.ప్రజలకు సురక్షితమైన తాగునీరు అందేలా రాష్ట్ర ప్రభుత్వాలు సమర్థమైన నిర్వహణ వ్యవస్థలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పౌరుల రాజ్యాంగ హక్కులకు భంగం కలిగినప్పుడు న్యాయస్థానాలు జోక్యం చేసుకోవాలని పేర్కొన్నారు. మానవ హక్కుల కమిషన్లు తమకు అందే ఫిర్యాదులపై విచారణ జరిపి, సంబంధిత సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లాలని సూచించారు.

రియాద్ విమానాశ్రయంపై దాడి!

కైరో: సౌదీ అరేబియాలోని రియాద్ అంతర్జాతీయ విమానాశ్రయంపై క్షిపణి దాడి కలకలం రేపింది. ఈ ఘటనలో 12మంది మరణించగా, 300 మందికిపైగా గాయపడ్డారు. మృతుల్లో నలుగురు సౌదీ పౌరులతో పాటు బంగ్లాదేశ్‌కు చెందిన ఇద్దరు, మరో ఆరు దేశాలకు చెందినవారు ఒక్కొక్కరు ఉన్నట్లు అధికారులు వెల్లడించారు. కింగ్ ఖాలిద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో దేశీయ విమానాల రాకపోకలకు ఉపయోగించే 3, 4 టెర్మినళ్ల సముదాయంపై శనివారం క్షిపణి పడినట్లు ప్రాంతీయ అధికారి తెలిపారు. దీంతో విమానాశ్రయ కార్యకలాపాలను తాత్కాలికంగా నిలిపివేసి, పలు విమానాలను ఇతర విమానాశ్రయాలకు మళ్లించారు. గత 24 గంటల్లో రియాద్ విమానాశ్రయంలో కనీసం 291 విమానాలు రద్దయినట్లు ఫ్లైట్‌అవేర్ వెల్లడించింది. సౌదీ గగనతలంలో విమానాల రాకపోకలు ప్రమాదకరమని హూతీలు హెచ్చరించడంతో ఎయిర్ ఇండియా, ఫ్లై దుబాయ్, లుఫ్తాన్సా గ్రూప్, పాకిస్థాన్ ఇంటర్నేషనల్ ఎయిర్ లైన్స్ సహా పలు సంస్థలు సర్వీసులను నిలిపివేశాయి. అమెరికా, బ్రిటన్, జర్మనీ, ఆస్ట్రేలియా, కెనడా తదితర దేశాలు తమ పౌరులు విమానాశ్రయాలకు వెళ్లవద్దని సూచించాయి.



క్షిపణి నిరోధక వ్యవస్థల కొరత

సౌదీలో క్షిపణులను అడ్డుకునే ఇంటర్‌సెప్టర్ల నిల్వలు తగ్గుతున్నాయని ప్రాంతీయ అధికారులు వెల్లడించారు. గగనతల రక్షణకు సహకరించాలని ఫ్రాన్స్, బ్రిటన్, పాకిస్థాన్, ఈజిప్టులను సౌదీ కోరినట్లు తెలిపారు. ఇరాన్‌తో యుద్ధం కారణంగా అమెరికా వద్ద కూడా క్షిపణి నిరోధక ఆయుధాల నిల్వలు తగ్గుతున్నాయని ఓ అధికారి పేర్కొన్నారు. క్షిపణులు, డ్రోన్లను అడ్డుకునే చర్యలకు సంబంధించిన సమాచారం, ప్రభావిత ప్రాంతాల చిత్రాలను ప్రచారం చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని సౌదీ హెచ్చరించింది. గగనతల రక్షణ చర్యల వల్ల పౌర విమానాలను గుర్తించడంలో పొరపాట్లు జరిగే ప్రమాదం ఉందని యూరోపియన్ యూనియన్ ఏవియేషన్ సేఫ్టీ ఏజెన్సీ ఆందోళన వ్యక్తం చేసింది. ఇదిలాఉంటే సౌదీపై దాడులు అంతర్జాతీయ చమురు మార్కెట్లలో ఆందోళన పెంచాయి. హార్ముజ్ జలసంధిలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఎర్ర సముద్రంలోని బాబ్ ఎల్ మండెబ్ జలసంధి ప్రాధాన్యం పెరిగింది. ఈ మార్గంలో నౌకాయానానికి ఆటంకాలు ఏర్పడితే ప్రపంచ చమురు సరఫరాపై ప్రభావం పడే అవకాశముంది. ఉద్రిక్తతలను తగ్గించేందుకు దౌత్యపరమైన పరిష్కారాలకు మద్దతు ఇవ్వాలని సౌదీ, ఒమన్ విదేశాంగ మంత్రులు ఫోన్‌లో చర్చించారు.

జంతర్ మంతర్‌పై ఆంక్షలు బీజేపీ ఓటమే

- డీనోటిఫై చేయడంపై ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్ ఆగ్రహం
- లోక్ కల్యాణ్ మార్గ్‌ను ఆందోళనల ప్రదేశంగా కేటాయించాల్సిందని ఎద్దేవా

న్యూఢిల్లీ: దేశ రాజధానిలోని ప్రముఖ నిరసన ప్రదేశం జంతర్ మంతర్‌ను ఆందోళనలకు వేదికగా గుర్తించకుండా ఢిల్లీ పోలీసులు డీనోటిఫై చేయడంపై సమాజ్‌వాదీ పార్టీ అధినేత, ఎంపీ అఖిలేశ్ యాదవ్ స్పందించారు. ఈ నిర్ణయం భాజపాకు అతి పెద్ద ఓటమి అని వ్యాఖ్యానించారు. ప్రజా ఆగ్రహానికి భయపడుతున్న ప్రభుత్వం.. నిరసనకారులను అధికార కేంద్రాలకు దూరంగా ఉంచేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. ప్రభుత్వ కార్యాలయాలు, అధికార కేంద్రాలకు దూరంగా ఉన్న ప్రాంతాలను నిరసన స్థలాలుగా గుర్తించడం ప్రజల సమస్యలను పాలకుల దృష్టికి తీసుకెళ్లే అవకాశాన్ని తగ్గిస్తుందని అఖిలేశ్ పేర్కొన్నారు. జంతర్ మంతర్‌ను నిరసనలకు వేదికగా తొలగించడానికి బదులుగా.. ప్రధాని నివాసం ఉన్న లోక్ కల్యాణ్ మార్గ్‌ను ఆందోళన ప్రదేశంగా కేటాయించాల్సిందని అన్నారు. అలా చేస్తే ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు నేరుగా పాలకులకు తెలిసే అవకాశం ఉండేదని వ్యాఖ్యానించారు.

ఫార్ములా–ఈ కేసు నుంచి తప్పించండి



ప్రజానావ, హైదరాబాద్: ఫార్ములా–ఈ కార్ రేసింగ్ కేసులో తనను నిందితుల జాబితా నుంచి తొలగించాలని కోరుతూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక కోర్టును ఆశ్రయించారు. ఈ కేసులో తనను ఏ–1 నిందితుడిగా పేర్కొనడాన్ని సవాల్ చేస్తూ డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని, తనపై చేసిన ఆరోపణలకు ఆధారాలు లేవని పిటిషన్‌లో పేర్కొన్నట్లు సమాచారం. నిందితుల జాబితా నుంచి తన పేరును తొలగించాలని కోర్టును కోరారు.కేటీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌ను పరిశీలించిన నాంపల్లి ఏసీబీ కోర్టు.. దీనిపై సమగ్ర కౌంటర్ దాఖలు చేయాలని అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులను ఆదేశించింది. తదుపరి విచారణను ఈ నెల 30కి వాయిదా వేసింది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో హైదరాబాద్‌లో నిర్వహించిన ఫార్ములా–ఈ కార్ రేసింగ్ వ్యవహారం వివాదానికి దారితీసింది. రేసు నిర్వహణకు సంబంధించి నిబంధనలను ఉల్లంఘించి, కేబినెట్ అనుమతి లేకుండానే ప్రభుత్వ ఖజానా నుంచి రూ.55 కోట్లను యూకేకు చెందిన ఫార్ములా–ఈ ఆపరేషన్స్ (ఎఫ్ఈఓ) సంస్థకు బదిలీ చేశారన్నది ప్రధాన ఆరోపణ. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ వ్యవహారంపై ఏసీబీ దర్యాప్తు చేపట్టి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేసింది.ఏసీబీ దాఖలు చేసిన చార్జిషీట్‌లో అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను ఏ–1గా పేర్కొంది. అప్పటి మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌ను ఏ–2గా, హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్ రెడ్డిని ఏ–3గా చేర్చింది. క్రీడా కన్సల్టెంట్ కిరణ్ మల్లేశ్వరరావు ఏ–4గా, ఫార్ములా–ఈ ఆపరేషన్స్ ప్రతినిధి అల్బెర్టో లాంగో ఏ–5గా ఉన్నారు.అయితే, ఈ కేసులో తనపై వచ్చిన ఆరోపణలను కేటీఆర్ గతంలోనే ఖండించారు. ప్రజల దృష్టిని మళ్లించేందుకే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ కేసును తెరపైకి తెచ్చిందని విమర్శించారు. ఫార్ములా–ఈ కార్ రేసింగ్ కేసులో కేటీఆర్ ఇప్పటికే ఏసీబీ విచారణకు పలుమార్లు హాజరయ్యారు. నాంపల్లిలోని ఏసీబీ కోర్టులోనూ హాజరయ్యారు. చట్టాలపై గౌరవంతోనే విచారణకు హాజరవుతున్నట్లు గతంలో వెల్లడించారు. తాజాగా తనను కేసు నుంచి విముక్తి చేయాలని కోరుతూ డిశ్చార్జ్ పిటిషన్ దాఖలు చేశారు. ఏసీబీ కౌంటర్, తదుపరి విచారణలో కోర్టు తీసుకునే నిర్ణయంపై ఇప్పుడు ఆసక్తి నెలకొంది.

సౌదీకి కొరకరాని కొయ్యగా హూతీలు!

సౌదీ: చిన్న వేర్పాటువాద సంస్థగా ప్రారంభమైన హూతీలు.. నేడు పశ్చిమాసియాలో కీలక భద్రతా సవాలుగా మారారు. సంపన్న దేశమైన సౌదీ అరేబియాకు సైతం సవాలు విసురుతూ, వ్యూహాత్మకంగా అత్యంత కీలకమైన బాబ్ ఎల్ మండబ్ జలసంధి పరిసరాల్లో తమ ప్రభావాన్ని విస్తరించారు. ఎర్రసముద్రాన్ని గల్ఫ్ ఆఫ్ ఏడెన్‌తో అనుసంధానించే ఈ జలసంధి అంతర్జాతీయ సముద్ర వాణిజ్యానికి కీలక మార్గం. ఇక్కడ హూతీల కార్యకలాపాలు పెరగడంతో ప్రపంచ దేశాల దృష్టి ఈ సంస్థపై పడింది. 1990వ దశకంలో యెమెన్ ఉత్తర ప్రాంతంలో హూతీ ఉద్యమం ఆవిర్భవించింది. అక్కడి జైదీ షియా మైనారిటీ వర్గంలో ఈ ఉద్యమానికి బలమైన పునాదులు ఏర్పడ్డాయి. హుస్సేన్ అల్-హూతీ ఈ ఉద్యమానికి ప్రధాన వ్యవస్థాపకుడిగా గుర్తింపు పొందారు. 2004లో యెమెన్ ప్రభుత్వ బలగాలతో జరిగిన ఘర్షణల్లో ఆయన మరణించారు. అనంతరం ప్రభుత్వానికి వ్యతిరేకంగా హూతీల పోరాటం మరింత తీవ్రరూపం దాల్చింది. కాలక



భీమేశ్వర స్వామిని దర్శించుకున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

ప్రజానావ, వేములవాడ: రాజన్న సిరిసిల్ల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామివారిని వరంగల్ నియోజకవర్గ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్సీకి ఆలయ అధికారులు స్వాగతం పలికారు. దర్శనం, పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ మండపంలో వేద పండితులు, అర్చకులు ఆయనకు వేదాశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ పర్యవేక్షకులు శ్రీనివాస్ శర్మ ఎమ్మెల్సీని శాలువాతో సత్కరించి, స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదాలను అందజేశారు.

కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమాన్‌రెడ్డి కన్నుమూత



ప్రజానావ, పెద్దపల్లి: పెద్దపల్లి జిల్లా అంతర్గాం మండలానికి చెందిన కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు, మండల మాజీ అధ్యక్షుడు, గోలివాడ సమ్మక్క–సారలమ్మ జాతర కమిటీ అధ్యక్షుడు హనుమాన్‌రెడ్డి మృతి చెందారు. ఆయన మరణంతో కాంగ్రెస్ శ్రేణులు, స్థానికంగా విషాదం నెలకొంది. పార్టీ బలోపేతానికి, జాతర నిర్వహణకు ఆయన చేసిన సేవలను పలువురు స్మరించుకుంటూ సంతాపం వ్యక్తం చేశారు.

సింగరేణి కార్మికుల సమస్యలపై కరపత్రాల పంపిణీ



ప్రజానావ, పెద్దపల్లి: రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ ఆదేశాల మేరకు సోమవారం ఆర్జీ–1 ఏరియాలో సింగరేణి కార్మికుల సమస్యలపై ఆయన బృందం కరపత్రాలు పంపిణీ చేసింది. జీడీకే–11ఏ మైన్, ఓసీపీ–5, ఏరియా వర్క్‌షాప్, సింగరేణి ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో కార్మికులకు కరపత్రాలు అందజేశారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో కార్మికులకు జరిగిన అన్యాయాలను వివరిస్తూ.. సొంత ఇంటి పథకం, ఆదాయపు పన్ను మినహాయింపు, లాభాల వాటా, వారసత్వ ఉద్యోగాల సమస్యలను ప్రస్తావించారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు, సమస్యల పరిష్కారానికి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ కృషి చేస్తున్నారని బృందం సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండ రమేష్ గౌడ్, జనగాం శ్రీనివాస్ గౌడ్, అరగంట కృష్ణ, భాస్కర్ కిరణ్, పాకాల సాయికుమార్, బద్రి శంకర్, ఎల్. ఆంజనేయులు, గోషికే కనకయ్య, దార సుశీల, రవికుమార్, కుమారస్వామి సంపత్, మామిడి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

21 నుంచి పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

ప్రజానావ, సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో అక్టోబర్ 21 నుంచి 31 వరకు పోలీస్ అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్పీ మహేష్ బి. గితే తెలిపారు. అక్టోబర్ 21న చందుర్తి మండలం లింగంపేట్ శివారులోని అమరవీరుల స్థూపం వద్ద స్మృతి పరేడ్ నిర్వహించి, అమరవీరులకు నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాలు, ర్యాలీలు, ఓపెన్ హౌస్ కార్యక్రమాలు, వ్యాసరచన, ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలిమ్స్ పోటీలు నిర్వహించడంతో పాటు అమరవీరుల కుటుంబాలను పరామర్శించనున్నట్లు తెలిపారు. పోలీస్ కళాబృందం ద్వారా అవగాహన కార్యక్రమాలు చేపట్టి, ప్రధాన కూడళ్లలో అమరవీరుల బ్యానర్లు ఏర్పాటు చేస్తామన్నారు. దేశ రక్షణ, ప్రజల భద్రత కోసం ప్రాణత్యాగం చేసిన పోలీసుల సేవలను ప్రజలు గుర్తుంచుకోవాలని ఎస్పీ కోరారు.

అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం

బాధితులకు అండగా నిలిచిన కాటూరి రమేష్



ప్రజానావ, హైదరాబాద్ : భగత్‌సింగ్ కాలనీలోని వీధి నంబర్ ఒకటిలో మంజుల (భర్త స్వామి) నివాసం ఉంటున్న గదిలో అకస్మాత్తుగా అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనను గమనించిన బస్తీ వాసులు వెంటనే కాటూరి రమేష్‌కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న ఆయన వెంటనే ప్రమాద స్థలానికి చేరుకుని ఘటన జరిగిన తీరును, అక్కడి పరిస్థితులను పరిశీలించారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే దానం నాగేందర్‌తో మాట్లాడి అగ్ని ప్రమాద బాధిత కుటుంబానికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. అలాగే సంబంధిత అధికారులతో మాట్లాడి బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బస్తీ వాసులు గుంటి వెంకటేష్ సాగర్, మోహన్ సాగర్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనకు ప్రత్యేక కార్యాచరణ

- **నషా ముక్త్, టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లపై రెడ్‌క్రాస్ శాఖలకు దిశానిర్దేశం**
- **యువతలో అవగాహన, క్షయ బాధితులకు పౌష్టికాహార సహాయంపై దృష్టి**



ప్రజానావ, హైదరాబాద్ : రాష్ట్రవ్యాప్తంగా మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టి, యువతలో అవగాహన పెంపొందించడంతో పాటు మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి అన్ని జిల్లాల్లో సమన్వయంతో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తెలంగాణ రాష్ట్ర శాఖ చైర్మన్ ఎం. దానకిశోర్ సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్, టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమా లను సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా రెడ్‌క్రాస్ శాఖలకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ ఆదేశాల మేరకు లోక్‌భవన్‌లో రాష్ట్రంలోని అన్ని జిల్లా రెడ్‌క్రాస్ శాఖల కార్యవర్గ సభ్యులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో దానకిశోర్ రాష్ట్ర రెడ్‌క్రాస్ శాఖ జనరల్ సెక్రటరీ, సీఈఓ ప్రొఫెసర్ ఎ. శ్రీరాములుతో కలిసి ఈ రెండు కార్యక్రమాల అమలుపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా రాష్ట్రవ్యా ప్తంగా విస్తృత ప్రచార కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు, ఈ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర గవర్నర్ అధికారికంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. దసరా అనంతరం జిల్లాలవారీగా అవగాహన ర్యాలీలు, విద్యాసంస్థల్లో సదస్సులు, పోస్టర్ ప్రదర్శనలు, ప్రతిజ్ఞా కార్యక్రమాలు, ఇతర చైతన్య కార్యక్రమాలు నిర్వహించేందుకు సమగ్ర కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని జిల్లా రెడ్‌క్రాస్ శాఖలను ఆదేశించారు. ఈ కార్యక్రమాల్లో జూనియర్, యూత్ రెడ్‌క్రాస్ వాలంటీర్లతో పాటు జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్), జాతీయ క్యాడెట్ దళం (ఎన్‌సీసీ), భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ వాలంటీర్లను భాగస్వాములను చేయాలని సూచించారు. సంబంధిత విశ్వవిద్యాలయాల ఉపకులపతు లు, విద్యాసంస్థల యాజమాన్యాలతో సమన్వయం చేసుకుం టూ ప్రచార కార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించా లని పేర్కొన్నా రు. మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే ఆరోగ్య, కుటుంబ, సామాజిక దుష్పరిణామాలను యువత కు వివరించి, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించాలని తెలిపారు. ఈ కార్యక్రమాలను ఒకసారి నిర్వహించి ముగించ కుండా నిరంతర చైతన్య ఉద్యమంగా కొనసాగించాలని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా రెడ్‌క్రాస్ సభ్యత్వాన్ని గణనీయంగా పెంపొందించడంలో జిల్లా శాఖలు అందించిన సహకారాన్ని దానకిశోర్ అభినందిం చారు. భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ సభ్యత్వాల పెంపులో సాధించిన పురోగతిని ప్రస్తావిస్తూ, వారి సేవలను రెడ్‌క్రాస్ కార్యక్రమాల్లో సముచితంగా వినియోగించుకోవాలని సూచించారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా క్షయవ్యాధి బాధితులకు వైద్య చికిత్సతో పాటు అవసరమైన పౌష్టికాహార సహాయం అందించడంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని దానకిశోర్ పేర్కొన్నారు. ఇందుకోసం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారులు (డీఎంహెచ్ఓలు), జిల్లా క్షయవ్యాధి నియంత్రణ విభాగాలతో సమన్వయం చేసుకుని పౌష్టికాహార సహాయం అవసరమైన బాధితులను గుర్తించా లని సూచించారు. స్థానిక దాతలు, దాతృత్వ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, పారిశ్రామిక సంస్థలు, ఇతర దాతల సహకారంతో అర్హులైన బాధితులకు పౌష్టికాహార కిట్లు లేదా తగిన ఆహార సహాయం అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లబ్ధిదారుల గుర్తింపు, సహాయం అందించడంలో పారదర్శకత, నిరంతర పర్యవేక్షణతో పాటు సంబంధిత వైద్య విభాగాలతో సమన్వయానికి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. యువత సంక్షేమం, ప్రజారోగ్య పరిరక్షణ, సామాజిక చైతన్యం పెంపొందించే దిశగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ తన సేవలను మరింత విస్తరించాలని దానకిశోర్ సూచించారు. నషా ముక్త్ భారత్ అభియాన్, టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు జిల్లా శాఖలు స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని, వాలంటీర్ల భాగస్వామ్యం, ప్రభుత్వ శాఖల సమన్వయం, దాతల సహకారం, కార్యక్రమాల పురోగతిపై నిరంతరం దృష్టి సారించాలని ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని జిల్లా రెడ్‌క్రాస్ శాఖలు సంబంధిత ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమాలను సమర్థవం తంగా అమలు చేయాలని పేర్కొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ లో వివిధ జిల్లా రెడ్‌క్రాస్ శాఖల కార్యవర్గ సభ్యులు పాల్గొని, తమ జిల్లాల్లో చేపట్టనున్న కార్యక్రమాలపై చర్చించారు.



నవరాత్రి ఉత్సవాలకు పద్మారావు గౌడ్‌కు ఆహ్వానం

- **ఘనంగా ఉత్సవాలు నిర్వహించాలి**
- **నిరంతర అన్నప్రసాద వితరణ చేపట్టాలి**

ప్రజానావ, సికింద్రాబాద్ : చిలకలగూడలోని చారిత్రక కట్ట మైసమ్మ దేవాలయంలో నిర్వహించనున్న నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని సికింద్రాబాద్ శాసనసభ్యుడు, మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్‌ను ఆలయ అధికారులు ఆహ్వానించారు. ఈ మేరకు ఆలయ చైర్మన్ గుంటి కృష్ణ, కార్యనిర్వహణాధికారి మహేందర్ గౌడ్ నేతృత్వంలోని బృందం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే కార్యాలయాన్ని సందర్శించి ఆహ్వాన పత్రికను అందజేసింది. ఈ సందర్భంగా నవరాత్రి ఉత్సవాలను వైభవంగా నిర్వహించాలని, భక్తులకు నిరంతరం అన్నప్రసాదం పంపిణీ చేసేలా ఏర్పాట్లు చేయాలని పద్మారావు గౌడ్ సూచించారు. ఉత్సవాల సందర్భంగా తాను కూడా అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పాల్గొంటానని ఆయన పేర్కొన్నారు.

సికింద్రాబాద్ సర్కిల్‌లో నూతన ఎస్‌పీఎం షెడ్ ప్రారంభం

- **మరమ్మతులు, నిర్వహణ సేవలు వేగవంతం**
- **విద్యుత్ పరికరాల తరలింపులో సమయం ఆదా**



ప్రజానావ, సికింద్రాబాద్ : తెలంగాణ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ (టీజీఎస్‌పీడీసీఎల్) సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన ఎస్‌పీఎం షెడ్‌ను సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ వి. పాటిల్ ప్రారంభించారు. విద్యుత్ శాఖలో నియంత్రిక పరికరాల మరమ్మతులు, నిర్వహణతో పాటు సంబంధిత సాంకేతిక సేవలను మరింత సమర్థవంతంగా అందించాలనే ఉద్దేశంతో ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గతంలో ఎర్రగడ్డ ప్రాంతంలో ఉన్న ఎస్‌పీఎం మరమ్మతుల కేంద్రం సికింద్రాబాద్ సర్కిల్ పరిధిలోని పలు విద్యుత్ సెక్షన్లకు దూరంగా ఉండటంతో సిబ్బంది రవాణా, సమయ నిర్వహణలో ఇబ్బందులు ఎదురయ్యేవి. ఈ సమస్యల ను అధిగ మించేందుకు సికింద్రాబాద్ సర్కిల్‌కు అనుకూలమైన కేంద్ర స్థానంలో, ఆల్వాల్ ప్రాంతానికి సమీపంగా నూతన షెడ్‌ను ఏర్పాటు చేశారు. దీంతో వివిధ సెక్షన్ల నుంచి మరమ్మతుల కోసం విద్యుత్ నియంత్రిక పరికరాలను తరలించడం సులభతరం కానుంది. రవాణా సమయం తగ్గడంతో పాటు మరమ్మతుల ప్రక్రియ వేగవంతం కావడం, సిబ్బంది పనితీరు మెరుగుపడటం, పరికరాల నిర్వహణలో సమన్వయం పెరగడం వంటి ప్రయోజనాలు కలగను న్నాయి. తద్వారా విద్యుత్ సరఫరా వ్యవస్థ నిర్వహణకు అవసరమైన సాంకేతిక సేవలను మరింత సమర్థవం తంగా అందించేందుకు వీలవుతుంది. ఈ ప్రారంభో ్ఘ కార్యక్రమంలో టీజీఎస్‌పీడీసీఎల్ డైరెక్టర్లు ఎన్. నరసింహులు (ఆపరేషన్స్, పీ అండ్ ఎంఎం, ఐపీసీ, ఆర్ఏసీ, ఎనర్జీ ఆడిట్, డీపీఈ), వి. శివాజీ (ప్రాజెక్టులు, మాస్టర్ ప్లాన్, ఐటీ), చి. చక్రపాణి (కమర్షియల్), పి. కృష్ణారెడ్డి (ఫైనాన్స్, రెవెన్యూ, హెచ్ఆర్‌డీ, ఐఆర్, లీగల్, మెడికల్, అసెస్‌మెంట్స్), చీఫ్ ఇంజినీర్ పి. కరుణాకర్ బాబు, చీఫ్ ఇంజినీర్ (హెచ్ఆర్‌డీ) భిక్షపతి, చీఫ్ ఇంజినీర్ (ఓఅండ్ఎం) రవికుమార్, సూపరింటెండింగ్ ఇంజినీర్ టి. వేణుగోపాల్, మెట్రో జోన్‌కు చెందిన సూపరింటెం డింగ్ ఇంజినీర్లు, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ టి. శంకర్, డిప్యూటీ ఇంజినీర్ జి.వి. రమణారావు తదితర అధికారులు పాల్గొన్నారు. సికింద్రాబాద్ సర్కిల్‌లో విద్యుత్ నియంత్రిక పరికరాల నిర్వహణను వేగవంతం చేసి, మరింత సౌకర్యవంతంగా, సమర్థ వంతంగా వినియోగదారు లకు సేవలు అందించడంలో ఈ నూతన ఎస్‌పీఎం షెడ్ కీలక పాత్ర పోషించనుంది.





ఈఆర్ఓ ఆర్‌పీ నిలయం కార్యాలయంలో బతుకమ్మ సంబురాలు

- **తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టిన వేడుకలు**
- **ఉత్సాహంగా పాల్గొన్న ఉన్నతాధికారులు, సిబ్బంది**

ప్రజానావ, హైదరాబాద్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఈఆర్ఓ ఆర్‌పీ నిలయం కార్యాలయం వద్ద ఘనంగా నిర్వహించారు. తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతను, పూల పండుగ వైభవాన్ని ప్రతిబింబించేలా జరిగిన ఈ వేడుకలు ఆనందోత్సాహాల మధ్య కొనసాగాయి. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జితేష్ పటేల్, డైరెక్టర్ (ఫైనాన్స్, హెచ్ఆర్‌డీ) కృష్ణారెడ్డి, కమర్షియల్ డైరెక్టర్ చక్రపాణి, మెట్రో జోన్ చీఫ్ ఇంజినీర్ కరుణాకర్ బాబు, సూపరింటెండింగ్ ఇంజినీర్ వేణుగోపాల్ తదితర ఉన్నతాధికారులు ఉత్సాహంగా పాల్గొని వేడుకలకు ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాల గొప్పదనాన్ని చాటిచెప్పేలా నిర్వహించిన బతుకమ్మ వేడుకలు కార్యాలయ ప్రాంగణంలో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ సంబరాలు సిబ్బందిలో ఆనందాన్ని పంచడంతో పాటు వారిమధ్య ఐక్యత, సోదరభావం, పరస్పర సాన్నిహిత్యాన్ని మరింత బలోపేతం చేశాయి. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ఉన్నతాధికారులు, సిబ్బంది, పాల్గొన్న ప్రతి ఒక్కరికీ నిర్వాహకులు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

ఆటో ఇమ్యూన్ వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక దర్శనంపై టీటీడీ సానుకూలం

- **వివిధ అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి ఊరట కల్పించే దిశగా అడుగులు**
- **నిపుణుల కమిటీకి నివేదించాలని నిర్ణయం**

ప్రజానావ, తిరుమల : ఆటో ఇమ్యూన్, అరుదైన వ్యాధులతో బాధపడుతున్న వారికి తిరుమల శ్రీవారి ప్రత్యేక దర్శనం కల్పించే అంశంపై తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సానుకూలంగా స్పందించింది. ఈ వ్యాధిగ్రస్తులకు వైద్యపరమైన కేసుల విభాగంలో ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించే సాధ్యాసాధ్యాలను పరిశీలించేందుకు ఈ అంశాన్ని బహుళ విభాగాల నిపుణుల కమిటీకి నివేదించాలని నిర్ణయించింది. సిస్టమిక్ లూపస్ ఎరిథెమాటోసస్ (ఎస్ఎల్ఈ), స్క్లెరోడెర్మా, మల్టిపుల్ స్క్లిరోసిస్, అల్సరేటివ్ కొలైటిస్, క్రోన్స్ డిసీజ్, సికిల్‌సెల్ అనీమియా, తలసేమియా తదితర వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ సౌకర్యం కల్పించే అంశాన్ని కమిటీ పరిశీలించనుంది. ప్రస్తుతం టీటీడీ వైద్యపరమైన కేసుల విభాగంలో మూత్రపిండాల మార్పిడి, ఓపెన్ హార్ట్ శస్త్రచికిత్స, దయాలసిస్, కాలేయ మార్పిడి, మెదడు శస్త్రచికిత్స, క్యాన్సర్, నడవలేని స్థితికి దారితీసే వెన్నెముక శస్త్రచికిత్స చేయించుకున్న బాధితులకు మాత్రమే ఆన్‌లైన్ ముందస్తు బుకింగ్ ద్వారా ప్రత్యేక దర్శనం కల్పిస్తోం ది. ఆటో ఇమ్యూన్, జాతీయ అరుదైన వ్యాధుల విధానం–2021 కింద గుర్తించిన వ్యాధులతో బాధపడుతున్న వారికి ఈ సౌకర్యం కల్పించాలని కోరుతూ శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురానికి చెందిన ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయవాది ఎస్.కె. శ్రీకృష్ణ యశస్వి న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. ఈ అంశంపై విచారణ జరిపిన హైకోర్టు, దీనిని పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని టీటీడీని ఆదేశించింది. దీంతో టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర, టీటీడీ ముఖ్య వైద్యాధికారి, స్విమ్స్ డైరెక్టర్–కమ్ వైస్ ఛాన్సలర్ అభిప్రాయాలను కోరారు. మే 27న స్విమ్స్‌లో నిర్వహించిన నిపుణుల సమావేశంలో ఈ అంశంపై చర్చించారు. ఆయా వ్యాధుల రకాలు, తీవ్రత, బాధితుల్లో వైకల్య స్థాయి వేర్వేరుగా ఉండటంతో పాటు ఆన్‌లైన్‌లో వైద్య ధ్రువపత్రాల ధ్రువీకరణలో ఎదురయ్యే సమస్యలను నిపుణులు ప్రస్తావించారు. ఈ కారణాలతో ఆయా వ్యాధులను వెంటనే వైద్యపరమైన కేసుల విభాగంలో చేర్చడం సాధ్యం కాదని అభిప్రాయపడ్డారు. తద్వారా అరుదైన, ఆటో ఇమ్యూన్ వ్యాధులతో బాధపడు తున్న వారికి ప్రత్యేక దర్శన సౌకర్యం కల్పించే అంశంపై మరింత స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



ఓటు హక్కు, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలి

- **సిరిసిల్లలో కాంగ్రెస్ బైక్ ర్యాలీ, నిరసన**
- **కేకే మహేందర్‌రెడ్డి**

ప్రజానావ, సిరిసిల్ల : సామాన్య ప్రజల ఓటు హక్కును, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని కాంగ్రెస్ పార్టీ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జ్ కేకే మహేందర్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం సిరిసిల్లలో సుమారు 300 బైకులతో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్, మహాత్మా గాంధీ విగ్రహాలకు వినతిపత్రాలు సమర్పించి, శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వ్యవహారశైలిపై కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పాలని, ఎన్నికల వ్యవస్థపై ప్రజలకు నమ్మకం కల్పించాలని కేకే మహేందర్ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, యువత పాల్గొన్నారు.

ఏసీబీకి చిక్కిన తహసీల్దార్, సర్వేయర్

- **భూమి సర్వే నివేదిక జారీకి రూ.30 లక్షలు డిమాండ్**
- **చివరకు రూ.20 లక్షలకు బేరం**





ప్రజానావ, రంగారెడ్డి : అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారుల వలలో మరో ఇద్దరు ప్రభుత్వ అధికారులు చిక్కారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండల తహసీల్దార్ బి. సుదర్శన్‌రెడ్డి, మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులు లంచం తీసుకుంటూ ఏసీబీ, సీఐయూ అధికారులకు పట్టుబడ్డారు. అధికారిక పని చేసి పెట్టేందుకు ఫిర్యాదుదారుడి నుంచి రూ.20 లక్షలు లంచంగా తీసుకుంటుండగా అధికారులు పట్టుకున్నారు. ఏసీబీ వెల్లడించిన వివరాల ప్రకారం.. హెచ్ఎండీఏ నిబంధనల ప్రకారం భూమిని సర్వే చేసి, జాయింట్ ఇన్‌స్పెక్షన్ సర్వే నివేదిక జారీ చేసేందుకు నిందిత అధికారులు తొలుత రూ.30 లక్షలు లంచంగా డిమాండ్ చేశారు. అనంతరం ఆ మొత్తాన్ని రూ.20 లక్షలకు తగ్గించా రు. తహసీల్దార్ ఆదేశాల మేరకు ఫిర్యాదుదారుడి నుంచి లంచం సొమ్మును స్వీకరిస్తున్న సమయంలో అబ్దుల్లాపూర్‌మెట్ గ్రామ పరిధిలో మండల సర్వేయర్ బతుక శ్రీనివాసులు ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. ఆయన వద్ద నుంచి లంచం సొమ్మును అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సర్వేయర్ చేతి వేళ్లకు నిర్వహించిన రసాయన పరీక్షల్లో సానుకూల ఫలితాలు వచ్చినట్లు ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఈ వ్యవహారంలో తహసీల్దార్ బి. సుదర్శన్‌రెడ్డి, సర్వేయర్ బతుక శ్రీనివాసులు తమ విధులను అక్రమంగా, నిజాయితీకి విరుద్ధంగా నిర్వహించినట్లు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిపారు. అనంతరం ఇద్దరినీ అరెస్టు చేసి హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న ఎస్‌పీఈ, ఏసీబీ కేసుల ప్రత్యేక న్యాయస్థానం ఎదుట హాజరుపరచ నున్నట్లు పేర్కొన్నారు. ఈ కేసు ప్రస్తుతం దర్యాప్తులో ఉందని, ఫిర్యాదుదారుడి భద్రత దృష్ట్యా ఆయన వివరాలను వెల్లడించడం లేదని ఏసీబీ స్పష్టం చేసింది. ప్రభుత్వ అధికారులు ఎవరైనా లంచం డిమాండ్ చేస్తే ప్రజలు ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని సూచించింది. అలాగే వాట్సాప్ నంబర్ 9440446106 ద్వారా కూడా ఏసీబీని సంప్రదించవచ్చని తెలిపింది.



ఖమ్మంలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి శ్రీకారం

- వేద మంత్రోచ్చారణల నడుమ భూమిపూజ
- ప్రహరీ నిర్మాణానికి టీటీడీ రూ.3.40 కోట్లు మంజూరు

ప్రజానావ, ఖమ్మం : ఖమ్మం జిల్లాలో తిరుమల (శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణానికి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) శ్రీకారం చుట్టింది. సోమవారం వేద మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ త్రిదండి శ్రీమన్నారాయణ రామానుజ చిన్నజీయర్ స్వామి శాస్త్రోక్తంగా భూమిపూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఆలయ నిర్మాణం కోసం రాష్ట్ర ప్రభుత్వం 20.04 సెంట్ల భూమిని కేటాయించగా, ఆ స్థలానికి రక్షణగా ప్రహరీ గోడ నిర్మించేందుకు టీటీడీ రూ.3.40 కోట్లను మంజూరు చేసింది. ప్రధాన ఆలయంతో పాటు ఉపాలయాలు, రాజగోపురం, పోటు (వంటశాల), ప్రాకారం తదితర నిర్మాణాలను చేపట్టనున్నారు. ఆలయ నిర్మాణం పూర్తయితే ఖమ్మం పరిసర ప్రాంతాల భక్తులకు శ్రీవారి దర్శనం మరింత చేరువ కానుంది. అంతేకాకుండా ఆధ్యాత్మిక కార్యక్రమాలు, ధార్మిక ప్రచారానికి ఈ క్షేత్రం ప్రధాన కేంద్రంగా నిలవనుంది. ఈ సందర్భంగా చిన్నజీయర్ స్వామి మాట్లాడుతూ.. శ్రీనివాసుడి కుటుంబ సభ్యులుగా భావించి ప్రతి ఒక్కరూ ఆలయ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజలకు అరిష్టాలు తొలగి, పాడిపంటలతో పల్లెలు సుభిక్షంగా వర్ధిల్లాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో టీటీడీ జేఈవో డాక్టర్ ఎ. శరత్, ఆలయ డిప్యూటీ ఈవో శివప్రసాద్, ఎస్ఈ ఇన్‌ఛార్జి ఎస్. ప్రసాద్, డీఈ సురేంద్రనాథ్ రెడ్డి, సూపరింటెండెంట్ మల్లికార్జున, అర్చకులు తదితరులు పాల్గొన్నారు.

నేరాల నియంత్రణకు కమాండ్ కంట్రోల్ కేంద్రం

- 467 సీసీటీవీ కెమెరాల అనుసంధానం
- నిరంతర పర్యవేక్షణతో పోలీసు సేవలకు మరింత బలోపేతం

ప్రజానావ, చుంచుపల్లి : భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణను మరింత సమర్థవంతంగా చేపట్టేందుకు నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కమాండ్ అండ్ కంట్రోల్ కేంద్రాన్ని ఎస్పీ రోహిత్ రాజు సోమవారం చుంచుపల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రారంభించారు. జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏర్పాటు చేసిన మొత్తం 467 సీసీటీవీ కెమెరాలను ఈ కేంద్రానికి అనుసంధానించారు. వీటి ద్వారా ఆయా ప్రాంతాలను నిరంతరం పర్యవేక్షించడంతో పాటు అనుమానాస్పద కార్యకలాపాలను గుర్తించడం, నేరాలను నియంత్రించడం, అత్యవసర సమయాల్లో తక్షణమే స్పందించడం సులభతరం కానుంది. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని అవసరమైన ప్రాంతాల్లో మరిన్ని సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని ఎస్పీ అధికారులను ఆదేశించారు. పోలీసు సేవలను మరింత మెరుగుపరిచేందుకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. నేరాల నివారణ, ప్రజల భద్రతకు సాంకేతిక వ్యవస్థలు దోహదపడేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని పేర్కొన్నారు. అనంతరం పర్యావరణ పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులతో కలిసి ఎస్పీ మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణతో పాటు పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది



ప్రజానావ, నల్గొండ : పేదల సంక్షేమం కోసం కాంగ్రెస్ పార్టీ అహర్నిశలు కృషి చేస్తోందని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి అన్నారు. గట్టుప్పల్ మండలం కమ్మగూడెం గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించి ఇంటిని ప్రారంభించారు. అనంతరం లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. పేదలకు సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వీరమల్ల శ్రీశైలం గౌడ్, సర్పంచ్ మెరుగు సాలమ్మ, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ పేరుతో భూములు లాక్కుంటే సహించేది లేదు

- 'సోలార్ హటావో.. జమ్లా తండా బచావో' నినాదంతో నిరాహార దీక్ష
- న్యాయం జరిగే వరకు పోరాటం

ప్రజానావ, సిర్గాపూర్ : సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండలం జమ్లా నాయక్ తండా గ్రామ పంచాయతీ పరిధిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు పేరుతో తమ భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని తండా ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గత 50 ఏళ్లుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమ భూములను సోలార్ ప్రాజెక్టు పేరుతో లాక్కోవాలని చూస్తే సహించేది లేదని హెచ్చరించారు. పేద రైతులకు జీవనాధారంగా ఉన్న భూములను కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొంటూ, జిల్లా కలెక్టర్‌తో పాటు సంబంధిత అధికారులు వెంటనే జోక్యం చేసుకుని తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 'సోలార్ హటావో.. జమ్లా తండా బచావో' అంటూ నినాదాలు చేస్తూ తండా ప్రజలంతా ఏకమై నిరాహార దీక్ష చేపట్టారు. తమ భూములను కాపాడి న్యాయం జరిగే వరకు పోరాటాన్ని విరమించేది లేదని స్పష్టం చేశారు. సోలార్ ప్లాంట్ ఏర్పాటు విషయంలో తమ భూములకు నష్టం కలిగించే చర్యలను అడ్డుకోవాలని, అధికారులు తక్షణమే స్పందించి పేద రైతుల హక్కులను పరిరక్షించాలని తండా ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ బడుల్లో కిచెన్ గార్డెన్లు నిరుపయోగం

- విద్యార్థులకు సాగు పాఠాలు ప్రశ్నార్థకం
- నిర్వహణపై ప్రధానోపాధ్యాయుల నిర్లక్ష్యం



ప్రజానావ, నాగర్‌కర్నూల్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సాగుపై అవగాహన కల్పించాలనే లక్ష్యం నీరుగారుతోంది. మధ్యాహ్న భోజన పథకానికి అవసరమైన కూరగాయలను పాఠశాలల్లోనే సాగు చేసేలా ఏర్పాటు చేసిన కిచెన్ గార్డెన్లు చాలాచోట్ల నిరుపయోగంగా మారా యి. కూరగాయల సాగు ద్వారా విద్యార్థులకు భూసార పరీక్షలు, మట్టి నమూనాల సేకరణ, పంటల సాగుపై అవగాహన కల్పించాలనే ఉద్దేశం అమలుకు నోచుకోవడం లేదు. జిల్లాలోని పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. జిల్లాలో ఎంపిక చేసిన పీఎం శ్రీ పాఠశాలల్లో తోటల పెంపకాన్ని తప్పనిసరిగా చేపట్టాలని ప్రభుత్వం సూచించింది. ఈ మేరకు కొన్ని పాఠశాలల్లో విద్యార్థుల భాగస్వామ్యంతో కిచెన్ గార్డెన్లు ఏర్పాటు చేసినప్పటికీ నిర్వహణ సక్రమంగా లేక మొక్కలు ఎండిపోతున్నాయి. కిచెన్ గార్డెన్ల నిర్వహణకు ప్రభుత్వం ప్రత్యేకంగా నిధులు విడుదల చేస్తున్నప్పటికీ వాటిని ఇతర అవసరాలకు వినియోగిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. పది మంది విద్యార్థులు ఒక బృందంగా ఏర్పడి మట్టి నమూనాలు సేకరించి, వాటిని పరీక్షించి, అందుకు అనుగుణంగా కూరగాయల సాగు చేపట్టాల్సి ఉంది. ఇందుకోసం ప్రభుత్వం భూసార పరీక్షల కిట్లను కూడా సరఫరా చేసింది. భూసార పరీక్షలు నిర్వహించి వాటి ఫలితాలను విద్యార్థులకు తెలియజేయాలని సూచించినా క్షేత్రస్థాయిలో పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. నాగర్‌కర్నూల్ పట్టణంలోని జడ్పీ ఉన్నత పాఠశాల పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైంది. ఇక్కడ కిచెన్ షెడ్డు ఏర్పాటు చేసినప్పటికీ కూరగాయల తోటలు పెంచకపోవడంతో అది నిరుపయోగంగా మారింది. పట్టణంలోని మరో ప్రభుత్వ ఉన్నత పాఠశాల కూడా పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైనప్పటికీ ఇప్పటివరకు కిచెన్ షెడ్డు ఏర్పాటు చేయలేదు. అచ్చంపేట మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాల పీఎం శ్రీ పాఠశాలగా ఎంపికైంది. ఇక్కడ ఉపాధ్యాయులు కూరగాయల తోటలు ఏర్పాటు చేసినప్పటికీ సరైన నిర్వహణ లేకపోవడంతో మొక్కలు ఎండిపోతున్నాయి. దీంతో పాఠశాలల్లో కిచెన్ గార్డెన్ల ఏర్పాటు వెనుక ఉన్న విద్యార్థులకు సాగుపై అవగాహన కల్పించే లక్ష్యం ఆశించిన స్థాయిలో నెరవేరడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



30 పడకల ఆస్పత్రిని రావులపల్లిలోనే నిర్మించాలి

- గొట్టిపర్తికి తరలించే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి
- సర్పంచ్ చింతకుంట్ల మనోజ్‌కుమార్ డిమాండ్

ప్రజానావ, తుంగతుర్తి : గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో రావులపల్లి గ్రామానికి మంజూరైన 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని గొట్టిపర్తి గ్రామానికి తరలించవద్దని రావులపల్లి గ్రామ సర్పంచ్ చింతకుంట్ల మనోజ్‌కుమార్ డిమాండ్ చేశారు. సోమవారం తుంగతుర్తి మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్ విజయం సాధించడంతో స్థానిక ఎమ్మెల్యే మందుల సామేలు పక్షపాత ధోరణితో వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే రావులపల్లికి మంజూరైన 30 పడకల ప్రభుత్వ ఆస్పత్రిని గొట్టిపర్తిలో నిర్మించేందుకు ప్రయత్నిస్తున్నారని మండిపడ్డారు. రావుల పల్లి గ్రామంలోనే ఆస్పత్రికి పక్కా ప్రభుత్వ భవనాన్ని నిర్మించి, స్థానిక ప్రజలకు వైద్యసేవలు అందుబాటు లోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో చింతకుంట్ల వీరన్న, చింతకుంట్ల మునేష్, కొమ్ము బాబు, పల్లెర్ల విష్ణు, మల్లేపాక వినయ్, చింతకుంట్ల యాకన్న తదితరులు పాల్గొన్నారు.

నార్లపూర్ పంపు ఆన్ చేసి రైతులను ఆదుకోవాలి

- రెండు రోజుల్లో నీటిని విడుదల చేయకుంటే కార్యాచరణ
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హెచ్చరిక



ప్రజానావ, మహబూబ్‌నగర్ : నార్లపూర్ రిజర్వాయర్, పంపుహౌస్ సిద్ధంగా ఉన్నప్పటికీ నాయకుల నిర్లక్ష్యం కారణంగా రైతులకు సాగునీరు అందడం లేదని, దీంతో పంటలు ఎండిపోయి రైతులకు వేల కోట్ల రూపాయల పంట నష్టం వాటిల్లుతోందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన నార్లపూర్ రిజర్వాయర్‌ను మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డితో కలిసి సందర్శించిన ఆయన, ఈ సందర్భంగా మాట్లాడుతూ 24 గంటల విద్యుత్ సరఫరా అందిస్తే పంపులను ప్రారంభించవచ్చని అధికారులు నివేదికలు ఇచ్చినా జిల్లా మంత్రులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. రైతుల సమస్యలను పక్కనపెట్టి వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని మండిపడ్డారు. మంత్రి కృష్ణారావు బీర్ల కంపెనీకి నీళ్లు ఇవ్వాలని చెబుతున్నారని, అయితే రైతుల అవసరాలను మాత్రం పట్టించుకోవడం లేదని ఎద్దేవా చేశారు. ఒకటి, రెండు రోజుల్లో నార్లపూర్ పంపును ప్రారంభించి నీటిని విడుదల చేయకపోతే తదుపరి కార్యాచరణ చేపట్టి రైతులకు అండగా నిలుస్తామని హెచ్చరించారు. గత కేసీఆర్ ప్రభుత్వ హయాంలో నార్లపూర్ రిజర్వాయర్ పంపుహౌస్‌ను సిద్ధం చేసి, 145 మెగావాట్ల సామర్థ్యం కలిగిన ఐదు మోటార్లను ఏర్పాటు చేశామని, ఒక పంపును ప్రారంభించి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేస్తూ ప్రయోగాత్మకంగా పరీక్షించినట్లు నిరంజన్‌రెడ్డి తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టుకు జూరాల ద్వారా 224 టీఎంసీలతో పాటు నల్లమల మార్గంలో వచ్చే నీటితో కలిపి మొత్తం 244 టీఎంసీల నీరు చేరిందని పేర్కొన్నారు. ఇందులో 50 టీఎంసీలు విద్యుత్ ఉత్పత్తికి సరిపోగా, మిగిలిన 180 టీఎంసీల నీటిని వినియోగించుకోకుండా ఆంధ్రప్రదేశ్‌కు వదిలేశారని ఆరోపించారు. కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని ఐదు పంపుల్లో ఒకటి తాగునీటి అవసరాల కోసం నడుస్తున్నప్పటికీ, మిగిలిన రెండు పంపులను ఎందుకు ప్రారంభించడం లేదో ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వల్ల జిల్లాకు ఒరిగిందేమీ లేదని విమర్శించారు. బీర్ల కంపెనీకి నీరు అందించడంపై చూపుతున్న శ్రద్ధను రైతుల సమస్యల పరిష్కారంపై చూపడం లేదని మంత్రులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కల్వకుర్తి ఎత్తిపోతల పథకంలోని మూడు పంపులను 24 గంటలపాటు నిరంతరాయంగా నడిపించాలని, నార్లపూర్ రిజర్వాయర్‌లో ఒక పంపును ప్రారంభించి సాగునీరు అందించడం ద్వారా రైతులను ఆదుకోవాలని నిరంజన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

గల్లీకో బెల్టు.. ఎక్కడికైనా మద్యం!

- గ్రామాలు, పురపాలికల్లో ఇష్టారాజ్యంగా గొలుసు దుకాణాలు
- 24 గంటలూ విక్రయాలు
- ఫోన్ చేస్తే మద్యం, తినుబండారాలు ఎక్కడికైనా సరఫరా



ప్రజానావ, నల్లగొండ: గ్రామాల్లో మద్యం గొలుసు దుకాణాలు ఇష్టారాజ్యంగా వెలుస్తున్నాయి. క్షేత్రస్థాయిలో అధికార యంత్రాంగం పర్యవేక్షణ కొరవడటంతో వీటి వ్యాపారం యథేచ్ఛగా సాగుతున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. పురపాలికల్లోనూ పలు కాలనీల్లో ఇలాంటి దుకాణాలు ఏర్పాటు చేసి మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. ఏ సమయంలోనైనా మద్యం అందుబాటులో ఉండటంతో యువత మద్యానికి బానిసలై భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. చిట్యాల పురపాలికలోనే సుమారు 25 గొలుసు దుకాణాలు ఉన్నట్లు తెలుస్తోంది. వీటిలో వివిధ బ్రాండ్ల మద్యం, బీర్లు అందుబాటులో ఉంచడంతోపాటు మద్యం ప్రియులు కోరిన మాంసాహార, శాకాహార వంటకాలను సైతం సిద్ధం చేసి ఇస్తున్నారు. అంతేకాకుండా మద్యం తాగే వారికి ఇబ్బంది లేకుండా కూలర్లను ఏర్పాటు చేసి మరీ విక్రయాలు సాగిస్తున్నట్లు సమాచారం. దుకాణం స్థాయిని బట్టి ఒక్కో చోట రోజుకు రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వ్యాపారం జరుగుతున్నట్లు తెలుస్తోంది. జిల్లాలోని ఐదు పురపాలికల్లో 210కి పైగా గొలుసు దుకాణాలు ఉన్నట్లు సమాచారం. ఇక గ్రామాల్లో వీటి పరిస్థితి ఏ స్థాయిలో ఉందో ఊహించుకోవచ్చని స్థానికులు అంటున్నారు. చిట్యాలలో ఓ మద్యం గొలుసు వ్యాపారి తన ఇంట్లో ప్రత్యేకంగా ఓ గదిని ఏర్పాటు చేసి, అందులో వివిధ రకాల మద్యం బ్రాండ్లను ప్రదర్శనకు ఉంచి దుకాణాన్ని నిర్వహిస్తున్నట్లు సమాచారం. మద్యం దుకాణాలకు దీటుగా పెద్ద మొత్తంలో మద్యం నిల్వలు ఉంచుతున్నారంటే పరిస్థితి తీవ్రత అర్థమవుతోంది. కొన్ని చోట్ల 24 గంటలూ విక్రయాలు సాగుతున్నట్లు ఆరోపణలు వస్తుండటంతో అధికారుల పర్యవేక్షణపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ అంశాలను చందూరు సర్కిల్ ఎక్సైజ్ సీఐ ఎం.పద్మ దృష్టికి తీసుకెళ్లగా మద్యం గొలుసు దుకాణాలపై తరచూ తనిఖీలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇటీవల చిట్యాలలో ఒక కేసు కూడా నమోదు చేశామని, నిరంతరం నిఘా కొనసాగిస్తున్నట్లు వివరించారు. మరోవైపు అర్ధరాత్రి వేళల్లో మందుబాబులు బెల్టు దుకాణాల తలుపులు తడుతుండటంతో వాటిని ఆనుకుని ఉన్న ఇళ్లలో నివసించే ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నామని వాపోతున్నారు. పురపాలికల్లో వార్డుల వారీగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి వాటిని పోలీసుస్టేషన్లకు అనుసంధానం చేస్తే అక్రమ మద్యం విక్రయాలపై నిఘా పెంచవచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఇదిలా ఉండగా పలు పురపాలికల్లో కొందరు గొలుసు వ్యాపారులు మరో అడుగు ముందుకేసి మద్యం సరఫరాను విస్తరించినట్లు తెలుస్తోంది. మద్యం ప్రియులు పట్టణాలకు దూరంగా ఉన్న స్థిరాస్తి వెంచర్లు, వ్యవసాయ బావులు, తోటల వద్ద కూర్చొని ఫోన్ చేస్తే చాలు.. వారు కోరిన మద్యం, తినుబండారాలను నేరుగా అక్కడికే తీసుకెళ్లి అందజేస్తున్నట్లు సమాచారం. ఇందుకు అదనంగా నగదు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. బహిరంగ ప్రదేశాల్లో పొద్దుపోయే వరకు మద్యం సేవించడంతో ఆయా ప్రాంతాల్లో నివసించే ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాలు, పురపాలికల్లో విచ్చలవిడిగా సాగుతున్న గొలుసు మద్యం విక్రయాలపై కఠినంగా నిఘా పెట్టి, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



పింఛన్ల దరఖాస్తుల ధ్రువీకరణ పత్రాల తనిఖీ

- 12 మంది లబ్ధిదారుల అర్హతల పరిశీలన

ప్రజానావ, బూర్గంపహాడ్ : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపహాడ్ మండలం నాగినేనిప్రోలు రెడ్డిపాలెం గ్రామంలో కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ధ్రువీకరణ పత్రాలను డీపీవో అనూష సోమవారం తనిఖీ చేశారు. గ్రామంలో దివ్యాంగులు, వితంతువులు, ఒంటరి మహిళలకు సంబంధించిన మొత్తం 12 మంది దరఖాస్తులను పరిశీలించి, వారి అర్హతలను నిర్ధారించే ధ్రువీకరణ పత్రాలను తనిఖీ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వ పింఛన్లు అందేలా దరఖాస్తుల పరిశీలన చేపట్టారు. అనంతరం దసరా పండుగను పురస్కరించుకుని గ్రామంలో పనిచేస్తున్న 14 మంది మల్టీపర్పస్ వర్కర్లకు రూ.1.50 లక్షల వేతనాలను ముందస్తుగా అందజేశారు. పండుగ సందర్భంగా కార్మికులకు వేతనాలు ముందుగానే చెల్లించడంతో వారు సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బానోత్ సరోజ, పంచాయతీ కార్యదర్శి రేపాక రవి, మల్టీపర్పస్ వర్కర్లు పాల్గొన్నారు.

తెగులు మందు పిచికారీతో పది ఎకరాల వరి పంటకు నష్టం

- రూ.10 లక్షల నష్టం జరిగిందని కౌలు రైతు ఆవేదన
- కలెక్టర్‌కు ఫిర్యాదు



ప్రజానావ, అర్వపల్లి : వరి పంటకు తెగులు నివారణ మందు పిచికారీ చేయడంతో పది ఎకరాల పంట పూర్తిగా దెబ్బతిన్నదని కౌలు రైతు దిర్శనపు కృష్ణమూర్తి ఆవేదన వ్యక్తం చేశాడు. సూర్యాపేట జిల్లా అర్వపల్లి మండలం కాసర్లపహాడ్ గ్రామానికి చెందిన కృష్ణమూర్తి అదే గ్రామంలో పది ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని వరి సాగు చేస్తున్నాడు. ప్రస్తుతం పంట పొట్ట దశలో ఉండి చేతికి వచ్చే సమయంలో పురుగు, తెగులు సోకడంతో నివారణ చర్యల్లో భాగంగా మిర్యాలగూడలోని ఓ ఎరువులు, పురుగు మందుల దుకాణం యజమానిని సంప్రదించాడు. సదరు దుకాణదారు ఇచ్చిన మందును పొలంలో పిచికారీ చేసినట్లు రైతు తెలిపాడు. అయితే, మందు పిచికారీ చేసిన 24 గంటల్లోనే పది ఎకరాల్లోని వరి పంట మొత్తం క్షీణించి, మాడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. దీంతో తనకు సుమారు రూ.10 లక్షల వరకు నష్టం వాటిల్లిందని వాపోయాడు. ఈ ఘటనపై తుంగతుర్తి వ్యవసాయ సహాయ సంచాలకుడికి (ఏడీఏ), జాజిరెడ్డిగూడెం వ్యవసాయ అధికారికి (ఏఓ) ఫిర్యాదు చేయగా, వారు మందులు విక్రయించిన డీలర్‌ను పిలిపించి క్షేత్రస్థాయిలో పరిశీలన జరిపినట్లు తెలిపాడు. అయినప్పటికీ ఇప్పటివరకు తనకు న్యాయం జరగలేదని పేర్కొన్నాడు. దీంతో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశాడు. పంట నష్టంపై సమగ్ర విచారణ జరిపించి, పంట దెబ్బతినడానికి కారణాలను గుర్తించాలని, బాధ్యులైనట్లు తేలితే పురుగుమందుల డీలర్ నుంచి నష్టపరిహారం ఇప్పించి తనను ఆదుకోవాలని కలెక్టర్‌ను కోరాడు.

సుక్మా కొండల్లో మావోయిస్టుల ఆయుధాల డంప్ స్వాధీనం

- ఇన్సాస్ రైఫిల్‌తో పాటు తుపాకులు, పేలుడు పదార్థాలు గుర్తింపు

ప్రజానావ, చర్ల : ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో భద్రతా బలగాలు మావోయిస్టుల ఆయుధాల డంప్‌ను స్వాధీనం చేసుకున్నాయి. కిష్టారం పోలీస్ స్టేషన్ పరిధిలోని పాలచెలిమి కొండల్లో నిర్వహించిన తనిఖీల్లో ఈ డంప్‌ను గుర్తించినట్లు అధికారులు వెల్లడించారు. ఇందులో ఇన్సాస్ రైఫిల్‌తో పాటు పలు తుపాకులు, పేలుడు పదార్థాలు ఉన్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఆయుధాలు, పేలుడు పదార్థాలకు సంబంధించి అధికారులు వివరాలు వెల్లడించారు.






సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే

- గ్రీవెన్స్ డే కార్యక్రమంలో 17 ఫిర్యాదులు
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

ప్రజానావ, సిరిసిల్ల : ప్రజల వద్ద నుండి ఫిర్యాదులు స్వీకరించి సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బాధితులకు సత్వర న్యాయం చేయడానికి ప్రతి సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో గ్రీవెన్స్ డే కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని జిల్లా ఎస్పీ తెలిపారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్ డే కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి 17 ఫిర్యాదులు స్వీకరించి, ఆయా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఫోన్ చేసి బాధితుల సమస్యలను చట్టపరంగా త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలకు పోలీస్ సేవలు మరింత చేరువ చేయడమే లక్ష్యంగా, ప్రజా సమస్యలు పరిష్కరించే విధంగా కృషి చేయడం జరుగుతుందని, పోలీస్ అధికారులు, సిబ్బంది పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా ప్రవర్తించి, వినతులు, ఫిర్యాదులు స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి చట్ట ప్రకారం బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడాలన్నారు. గ్రీవెన్స్ డే ద్వారా ప్రజలు నేరుగా తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం ద్వారా సాధ్యమైనంత త్వరగా వాటిని పరిష్కరించేలా చూస్తామని ఎస్పీ తెలిపారు.

సిరిసిల్ల పద్మశాలి సంఘు బలోపేతమే లక్ష్యం

నేతన్నను అసెంబ్లీకి పంపేలా ఐక్యంగా కృషి



ప్రజానావ, సిరిసిల్ల: సిరిసిల్ల పట్టణ పద్మశాలి సంఘాన్ని బలోపేతం చేసి, రాబోయే ఎన్నికల్లో నియోజకవర్గం నుంచి పద్మశాలి సామాజిక వర్గానికి చెందిన వ్యక్తిని అసెంబ్లీకి పంపేలా ఐక్యంగా కృషి చేస్తామని పట్టణ సంఘం అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్ తెలిపారు. సోమవారం సిరిసిల్లలో నూతన రెండో పట్టణ పద్మశాలి సంఘం కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం అధ్యక్షుడు వల్లకాటి రాజ్‌కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పద్మశాలీల ఆత్మగౌరవం, ఐక్యత కోసం కేవలం రూ.10 సభ్యత్వంతో సంఘాన్ని బలోపేతం చేస్తామని, పెద్ద సంఖ్యలో సభ్యులను చేర్పిస్తామని నేతలు పేర్కొన్నారు. నూతన సంఘం అధ్యక్షుడిగా నాగుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా మాదాస్ శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా గుంటుక పురుషోత్తం, సహాయ కార్యదర్శిగా జిందం రవీందర్, కోశాధికారిగా దాసరి వెంకటేష్, కార్యవర్గ సభ్యులుగా గాజుల సదానందం, దూడం సురేష్, తాటిపాముల సత్యనారాయణ బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పద్మ పీఠం ఎడిటర్ కొక్కుల భాస్కర్, మార్కండేయ జయంతి ఉత్సవ సమితి కన్వీనర్ మోర శ్రీనివాస్, దుబ్బాక పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు గాలయ్య, మాజీ కౌన్సిలర్లు గుడూరి భాస్కర్, పత్తిపాక పద్మశంకర్, జిల్లా కార్యనిర్వహణ అధ్యక్షుడు గోనె ఎల్లప్ప, అరుకాల రమేష్, దేవసపల్లి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు గడువులోగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



ప్రజానావ, సిరిసిల్ల: ప్రజావాణికి వచ్చే దరఖాస్తులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడీఓసీలో నిర్వహించిన ప్రజావాణిలో కలెక్టర్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ప్రజల నుంచి 129 దరఖాస్తులు స్వీకరించి సంబంధిత శాఖల అధికారులకు అందజేశారు. సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో 7, వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో ఒక దరఖాస్తు అందినట్లు తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ సూచించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి జయశ్రీ, హౌసింగ్ పీడీ వెంకట మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమి పూజ

పాల్గొన్న సిరిసిల్ల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సూర దేవరాజు



ప్రజానావ, సిరిసిల్ల : సిరిసిల్ల పట్టణం 11వ వార్డు ముష్టి పెళ్లికి చెందిన దాసరి అరుణ, వేముల సత్తవ్వ ల రెండు ఇందిరమ్మ ఇళ్లు భూమి పూజ ను పట్టణ అధ్యక్షులు సూర దేవరాజు చేతుల మీదుగా నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో పట్టణ కేంద్రంలో గ్రామాలలో ఇండ్లు లేని వారు ఉండకూడదని ఉద్దేశంతో కాంగ్రెస్ ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు ఇస్తుందని, వారి గౌరవాన్ని కాపాడుతుందని ఈ సందర్భంగా సూర దేవరాజు తెలిపారు. వేల సంఖ్యలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసిందని దసరా వరకు రెండో విడత మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల పట్టాలు వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి వంతడుపుల రాము, వార్డు అధ్యక్షులు వంగరి అనిల్, ఆకని సతీష్, ఆడెపు శ్రీను, ప్రసాద్ కాంగ్రెస్ నాయకులు ఏండి కలీం కొండ ప్రకాష్ మ్యాన పద్మనాభం సత్యనారాయణ, సృజన్ తదితరులు పాల్గొన్నారు.

కేసులు నమోదైనా.. అనర్హుల వైద్యం ఆగేదెప్పుడు?

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో యథేచ్ఛగా అల్లోపతి చికిత్సలు
- అనుమతులు లేకుండానే మందుల విక్రయాలు
- ఈ ఏడాది 140 కేసులు
- నిబంధనలు ఉల్లంఘిస్తే జైలు శిక్ష, రూ.5 లక్షల వరకు జరిమానా



ప్రజానావ, వరంగల్ : తెలంగాణ వైద్య మండలి ప్రతినిధులు ఒకవైపు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తూ, అనర్హులపై కేసులు నమోదు చేస్తున్నా మరోవైపు ఉమ్మడి వరంగల్ జిల్లాలో అర్హత లేని కొందరు అల్లోపతి వైద్యం కొనసాగిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైద్య పట్టాలు లేకుండానే రోగులకు చికిత్స అందిస్తుండటంతో పాటు, సరైన అనుమతులు, ఫార్మసిస్టులు లేకుండానే ఔషధాల విక్రయాలు సాగిస్తున్నట్లు తాజా తనిఖీల్లో వెలుగులోకి వచ్చింది. ఈ క్రమంలో తాజాగా మరో ముగ్గురిపై కేసులు నమోదయ్యాయి. గతంలోనూ పలువురిపై కేసులు నమోదైనా కొందరు తమ కార్యకలాపాలను కొనసాగిస్తుండటం ఆందోళన కలిగిస్తోంది.

కేసులు నమోదైనా తగ్గేదేలే!

నగరంలోని పలు ఆర్ఎంపీ కేంద్రాల్లో గతంలో అధికారులు తనిఖీలు నిర్వహించి కేసులు నమోదు చేశారు. అయినప్పటికీ కొందరు మళ్లీ అల్లోపతి వైద్యం కొనసాగిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. రెండు, మూడు సార్లు కేసులు నమోదైనప్పటికీ అనర్హులు వైద్య సేవల పేరుతో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు తెలుస్తోంది. గత ఆగస్టులో కరీమాబాద్, శివనగర్, ఊరుగొండ, కాజీపేట తదితర ప్రాంతాల్లో ఇతర ప్రాంతాలకు చెందిన రాష్ట్ర వైద్య మండలి సభ్యులు తనిఖీలు చేపట్టారు. తనిఖీల విషయం తెలుసుకున్న ఇద్దరు తమ ప్రథమ చికిత్స కేంద్రాలకు తాళాలు వేసినట్లు సమాచారం. ఈ తనిఖీల్లో 16 మందిపై వైద్య మండలి చట్టం ప్రకారం చర్యలు తీసుకున్నారు.

వైద్యంతోపాటు మందుల వ్యాపారం!


అర్హత లేని కొందరు అల్లోపతి చికిత్సలు అందించడమే కాకుండా, సరైన అనుమతులు లేకుండానే ఔషధాలు విక్రయిస్తున్నట్లు తనిఖీల్లో గుర్తించారు. ప్రథమ చికిత్స కేంద్రాల్లో మందులు, ఇంజెక్షన్లు కూడా లభించడం గమనార్హం. ఈ స్థాయిలో ఔషధాల విక్రయాలు జరుగుతున్న పటికీ సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వరంగల్ నగరంలో ఔషధాల హోల్‌సేల్ వ్యాపారం అధికంగా జరుగుతున్న నేపథ్యంలో నిబంధనల అమలుపై పర్యవేక్షణ పెంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఉల్లంఘనలకు కఠిన చర్యలు

ఈ ఏడాది ఉమ్మడి వరంగల్ జిల్లాలో 140 కేసులు నమోదయ్యాయని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ మెడికల్ ప్రాక్టీషనర్స్ రిజిస్ట్రేషన్ (టీఎంపీఆర్) చట్టంలోని సెక్షన్ 22, జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) చట్టంలోని సెక్షన్లు 34, 54 ప్రకారం చర్యలు తీసుకునే అవకాశం ఉందని హెల్త్‌కేర్ రీఫార్మ్స్ డాక్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ వెంకటస్వామి తెలిపారు. నేరం నిర్ధారణ అయితే ఏడాది వరకు జైలు శిక్ష, రూ.5 లక్షల వరకు జరిమానా లేదా నేర స్వభావాన్ని బట్టి రెండూ విధించే అవకాశం ఉందని పేర్కొన్నారు. టీఎంపీఆర్, ఎన్ఎంసీ చట్టాల ప్రకారం నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకుంటామని రాష్ట్ర వైద్య మండలి సభ్యుడు డాక్టర్ నరేష్ తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా వైద్య మండలి విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తోందని వెల్లడించారు. అనర్హుల వైద్య సేవలను అరికట్టడంతోపాటు, అనుమతులు లేకుండా ఔషధాలు విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వేములవాడ రాజన్న ఆలయంలో వైభవంగా శరన్నవరాత్రోత్సవాలు

రెండో రోజు బ్రహ్మచారిణి అలంకారంలో దర్శనమిచ్చిన అమ్మవారు



ప్రజానావ, వేములవాడ: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రోత్సవాలు భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా సోమవారం రెండో రోజు అశ్వయుజ శుద్ధ విదియ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారు బ్రహ్మచారిణి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 5:30 గంటల నుంచి ప్రారంభమైన పూజా కార్యక్రమాల్లో శ్రీ లక్ష్మీ గణపతి స్వామివారికి ప్రత్యేక అభిషేకం, అర్చన నిర్వహించగా, శ్రీ రాజరాజేశ్వర స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం చేపట్టారు. శ్రీ రాజరాజేశ్వరీ అమ్మవారికి శ్రీ సూక్తం, దుర్గాసూక్తం, లలితా సహస్రనామ పారాయణంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనుబంధ ఆలయాల్లోని పరివార దేవతలకు అభిషేకాలు, అర్చనలు జరిపి, జపాలు, పారాయణాలు, హోమాలు నిర్వహించా రు. సాయంత్రం శ్రీమద్ దేవీభాగవత పురాణ ప్రవచనం నిర్వహించగా, అనంతరం అమ్మవారికి విశేష పూజలు, బ్రహ్మచారిణి అలంకార పూజ చేపట్టారు. కన్యా పూజ, సువాసినీ పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించి, భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. చివరగా పల్లకీసేవలో హరిహరుల ఊరేగింపును వైభవంగా నిర్వహించారు. శరన్నవరాత్రోత్సవాల సందర్భంగా ఆలయంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.



సింగరేణి కార్మిక గర్జన సభను విజయవంతం చేయాలి

- అక్టోబర్ 14న గోదావరిఖనిలో బహిరంగ సభ
- మిరియాల రాజిరెడ్డి పిలుపు

ప్రజానావ, పెద్దపల్లి: గోదావరిఖని సింగరేణి కార్మికుల హక్కుల పరిరక్షణ, పెండింగ్ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అక్టోబర్ 14న గోదావరిఖనిలో నిర్వహించనున్న 'సింగరేణి కార్మిక గర్జన' బహిరంగ సభను విజయవంతం చేయాలని టీబీజీకేఎస్ నాయకుడు మిరియాల రాజిరెడ్డి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా గోదావరిఖనిలోని సంఘం కేంద్ర కార్యాలయంలో సభ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజిరెడ్డి మాట్లాడుతూ, కార్మికులకు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రభుత్వం, గుర్తింపు కార్మిక సంఘాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. టీబీజీకేఎస్ హయాంలో కారుణ్య నియామకాల ద్వారా సుమారు 14 వేల మందికి, ఎక్స్‌టర్నల్ నోటిఫికేషన్ ద్వారా 3,800 మందికి, పెండింగ్‌లో ఉన్న మరో 3,250 మందికి ఉద్యోగాలు కల్పించడంలో కీలక పాత్ర పోషించామని తెలిపారు. కార్మికుల హక్కుల సాధనకు ఐక్యంగా పోరాడాలని, అక్టోబర్ 14న జరిగే సభకు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఈ సమావేశానికి ఆర్‌జీ–1 ఏరియా ఇన్‌చార్జి, సీనియర్ వైస్ ప్రెసిడెంట్ నూనె కొమరయ్య అధ్యక్షత వహించగా, టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామ్మూర్తి, అధికార ప్రతినిధి పర్లపల్లి రవి, కోశాధికారి చల్పూరి సతీష్, ఆర్గనైజింగ్ సెక్రటరీ ఐ. సత్యం, పల్లె సురేందర్, వంగళ భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రాజన్న నిత్య అన్నప్రసాద ట్రస్టుకు రూ.1.01 లక్షల విరాళం

కుమారుడి పేరు మీద విరాళం అందజేసిన దంపతులు

ప్రజానావ, వేములవాడ : వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి నిత్య అన్నప్రసాద ట్రస్టుకు భక్తులు విరాళాలు అందజేస్తూ అన్నదాన సేవలో భాగస్వాములవుతున్నారు. ఇందులో భాగంగా పెద్దిరెడ్డి జయవర్ధన్ రెడ్డి, గ్రీష్మారెడ్డి దంపతులు తమ కుమారుడు పెద్దిరెడ్డి రుగ్వేద్ రెడ్డి పేరు మీద రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు విరాళానికి సంబంధించిన చెక్కును ఆలయ ఏఈఓ లక్ష్మణ్ రావుకు దాతలు అందజేశారు. స్వామివారి నిత్య అన్నప్రసాద సేవలకు విరాళం అందించిన దాతలను ఆలయ అధికారులు ఈ సందర్భంగా అభినందించారు.



రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీజేపీ ధార్మిక సెల్ నూతన కార్యవర్గం నియామకం

- 13 మండలాలు, రెండు మున్సిపాలిటీలకు అధ్యక్షులు, కో–కన్వీనర్ల నియామకం
- నియామక పత్రాలు అందజేత

ప్రజానావ, రాజన్న సిరిసిల్ల: రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీజేపీ ధార్మిక సెల్‌ను బలోపేతం చేసే దిశగా నూతన కార్యవర్గాన్ని నియమించారు. జిల్లా కేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో సోమవారం జిల్లా ఎండోమెంట్స్ సెల్ (ధార్మిక సెల్) కన్వీనర్ డాక్టర్ సత్యనారాయణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి బీజేపీ రాష్ట్ర ధార్మిక సెల్ కన్వీనర్ సూర్య ప్రకాష్, జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లాలోని 13 మండలాలు, రెండు మున్సిపాలిటీల పరిధిలో ధార్మిక సెల్ మండల అధ్యక్షులు, కో–కన్వీనర్లను నియమించి, నూతనంగా బాధ్యతలు చేపట్టిన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు రెడ్డబోయిన గోపి మాట్లాడుతూ, నూతనంగా బాధ్యతలు చేపట్టిన నాయకులు ఆలయాల పరిరక్షణ, సనాతన ధర్మ విశిష్టతను ప్రజలకు తెలియజేయడం, హిందూ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించడం వంటి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. పురాతన దేవాలయాలు, వాటికి సంబంధించిన ఆస్తుల పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ధార్మిక సెల్ చేపట్టే కార్యక్రమాలకు జిల్లా బీజేపీ నాయకత్వం పూర్తి సహకారం అందిస్తుందని భరోసా ఇచ్చారు. రాష్ట్ర ధార్మిక సెల్ కన్వీనర్ సూర్య ప్రకాష్ మాట్లాడుతూ, రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలను రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అన్ని మండలాల్లో విస్తృతంగా చేపడుతూ నాయకులు చురుకుగా పాల్గొనడం అభినందనీయమన్నారు.



వేములవాడ అర్బన్ మండల నాయకులకు సన్మానం

రాష్ట్ర ధార్మిక సెల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా వేములవాడ అర్బన్ మండలంలో అత్యధిక ధార్మిక కార్యక్రమాలు నిర్వహించినందుకు బీజేపీ వేములవాడ అర్బన్ మండల అధ్యక్షుడు బుర్ర శేఖర్ గౌడ్‌తో పాటు ధార్మిక సెల్ అర్బన్ మండల అధ్యక్షుడు, ఇద్దరు కో–కన్వీనర్లను నాయకులు సన్మానించారు. ఈ సమావేశంలో బీజేపీ ధార్మిక సెల్ రాష్ట్ర జాయింట్ కో–కన్వీనర్లు నవీన్ కుమార్, భోగ రవికుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి పొన్నాల తిరుపతిరెడ్డి, జిల్లా ధార్మిక సెల్ కో–కన్వీనర్లు బొమ్మాడి స్వామి, గొట్టే రామచంద్రం, జిల్లా మైనారిటీ మోర్చా అధ్యక్షుడు షేక్ సాబీర్, జిల్లా మీడియా కన్వీనర్ కాసుగంటి రాజు రావు, గంభీరావుపేట మండల అధ్యక్షుడు కోడే రమేష్‌తో పాటు నూతనంగా నియమితులైన ధార్మిక సెల్ మండల అధ్యక్షులు, కో–కన్వీనర్లు పాల్గొన్నారు.

రూ.5 వేల స్టైపెండ్‌తో వైద్య సేవలు ఎలా అందించాలి?

- సమాన పనికి సమాన స్టైపెండ్ ఇవ్వాలంటూ జూనియర్ డాక్టర్ల నిరసన

ప్రజానావ, రాజన్న సిరిసిల్ల: ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందిస్తున్న తమకు అతి తక్కువ స్టైపెండ్ చెల్లిస్తున్నారని నిరసిస్తూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో 31 మంది జూనియర్ డాక్టర్లు ఆందోళనకు దిగారు. ఓపీ విధులను బహిష్కరించి, ఆసుపత్రి ఎదుట ప్లకార్డులు పట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. సమాన పనికి సమాన స్టైపెండ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. గత జూన్ నుంచి ఇంటర్న్‌షిప్ విధులు నిర్వహిస్తున్న తమకు నెలకు కేవలం రూ.5 వేలే అందుతున్నాయని జూనియర్ డాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఆమోదిత స్టైపెండ్ రూ.29,792 ఉండగా, తమకు మాత్రం అంతకంటే చాలా తక్కువ మొత్తాన్ని చెల్లిస్తున్నారని తెలిపారు. రోజుకు సుమారు రూ.166తో కనీస అవసరాలు కూడా తీర్చుకోవడం కష్టంగా మారిందన్నారు. ఇతర ఎంబీబీఎస్ ఇంటర్న్‌లతో సమానంగా విధులు నిర్వహిస్తూ, అదే స్థాయిలో వైద్య సేవలు అందిస్తున్నప్పుడు స్టైపెండ్‌లో వ్యత్యాసం ఎందుకని ప్రశ్నించారు. తమకు ఎక్కువ స్టైపెండ్ అవసరం లేదని, ఇతరులతో సమానంగా చెల్లించాలని నినాదాలు చేశారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం తమకు న్యాయం చేయాలని, స్టైపెండ్ చెల్లింపులపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని కోరారు. తమ సమస్యను తక్షణమే పరిష్కరించి న్యాయం చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.





ఆటపాటలతో అంబరాన్నంటిన బతుకమ్మ సంబరాలు

వాగేశ్వరి కళాశాలలో ఈనాడు ఎఫ్ఎం ఆధ్వర్యంలో వేడుకలు

ప్రజానావ, కరీంనగర్ : కరీంనగర్‌లో బతుకమ్మ వేడుకలు ఘనంగా కొనసాగుతున్నాయి. నగరంలోని వాగేశ్వరి డిగ్రీ అండ్ పీజీ కళాశాలలో ఈనాడు ఎఫ్ఎం ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు సందడిగా సాగాయి. ఈ వేడుకల్లో మహిళలు, యువతులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సంప్రదాయ దుస్తులు ధరించి, రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. బతుకమ్మ పాటలు పాడుతూ, కోలాటాలు ఆడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను చాటిచెప్పారు. కళాశాల ప్రాంగణం బతుకమ్మ పాటలతో మార్మోగింది.

సంప్రదాయాలను ముందు తరాలకు అందించాలి

బతుకమ్మ వేడుకల్లో కలెక్టర్ రాజర్షి షా



ప్రజానావ, ఆదిలాబాద్ : తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీక అని, ఈ గొప్ప సంస్కృతిని కొనసాగిస్తూ భావి తరాలకు అందించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఆకాంక్షించారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని క్రీడా ప్రాంగణంలో సోమవారం సాయంత్రం మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన బతుకమ్మ వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో కలిసి కాసేపు బతుకమ్మ ఆడుతూ సందడి చేశారు. తెలంగాణ ఆడపడుచులు ఎంతో భక్తిశ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మ పండుగ మన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతిబింబమని కలెక్టర్ పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న ఈ పండుగ విశిష్టతను కాపాడుతూ, యువతకు మన సంప్రదా యాల గొప్పదనాన్ని తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రాజేశ్వర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ మనోహర్, జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీకాంత్‌రెడ్డి, పుర అధ్యక్షురాలు అనూష, జిల్లా యువజన, క్రీడల అధికారి దయానందరెడ్డి, దిశ కమిటీ జిల్లా సభ్యురాలు నివేదిత వజే తదితరులు పాల్గొన్నారు.

యాసంగిలో ఆరుతడి పంటల సాగుకే ప్రాధాన్యం

ప్రజానావ, నిజామాబాద్ : ఎల్‌నినో ప్రభావంతో వర్షాభావ పరిస్థితులు ఏర్పడే అవకాశాల నేపథ్యంలో యాసంగి సీజన్‌లో రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి సారించాలని వ్యవసాయ శాస్త్రవేత్త రేవంత్ నాథన్, మండల వ్యవసాయ అధికారి సాయికిరణ్ సూచించారు. రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు రైతులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూగర్భ జలమట్టాలు క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో నీటి వినియోగాన్ని తగ్గించే పంటలను ఎంచుకోవాలని, వరి సాగుకు దూరంగా ఉండాలని కోరారు. నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని కందులు, పెసలు, మినుములు వంటి పప్పుధాన్యాల పంటలతో పాటు వేరుశనగ, నువ్వులు వంటి నూనెగింజల పంటలను సాగు చేయడానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాల్తుమ్మెద సొసైటీ చైర్మన్ సురేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్ పుణ్యమా అని..

- 24 ఏళ్ల తర్వాత కుటుంబంతో కలయిక!
- 2002 ఓటర్ల జాబితాతో అదృశ్యమైన యువతి ఆచూకీ
- ఆరు గంటల్లోనే గుర్తించిన థానే పోలీసులు


ప్రజానావ, ముంబై: 24 ఏళ్ల క్రితం కుటుంబానికి దూరమైన భారతి ఆశా కదమ్ ఆచూకీని థానే పోలీసులు ఎట్టకేలకు గుర్తించారు. 2002 ఓటర్ల జాబితాలోని వివరాలు, పాత పోలీసు రికార్డుల ఆధారంగా కేవలం ఆరు గంటల్లోనే ఆమె కుటుంబాన్ని గుర్తించి, వీడియో కాల్ ద్వారా తోబుట్టువులతో మాట్లాడించారు. చిన్నతనంలో నవీ ముంబైలో తప్పిపోయిన భారతి, అనంతరం జాన్వి వైభవ్ జంబ్రేగా పేరు మార్చుకుని ప్రస్తుతం సోలాపూర్‌లో నివసిస్తోంది. గత ఎనిమిదేళ్లుగా ఆమె తన కుటుంబం కోసం వెతుకుతుండగా, సోదరుడు విజయ్ కూడా ఆమె ఆచూకీ కోసం ప్రయత్నిస్తూనే ఉన్నాడు. చివరకు అక్టోబర్ 8న భారతి పోలీసులను ఆశ్రయించడంతో, ఓటర్ల జాబితా కీలక ఆధారంగా మారింది. 24 ఏళ్ల తర్వాత సోదరసోదరీమణులు మళ్లీ మాట్లాడుకోవడంతో కుటుంబంలో భావోద్వేగం నెలకొంది.

వ్యభిచార ముఠా నుంచి టీవీ నటికి విముక్తి

ప్రజానావ, ముంబై: మహారాష్ట్రలోని మీరా–భయందర్ ప్రాంతంలో వ్యభిచార ముఠా గుట్టును థానే పోలీసులు రట్టు చేశారు. హిందీ టీవీ సీరియళ్లు, వెబ్‌సిరీస్‌లలో నటించిన 35 ఏళ్ల నటిని ఈ ముఠా నుంచి రక్షించారు. వినోద రంగానికి చెందిన మహిళలను బలవంతంగా వ్యభిచారంలోకి దింపుతున్నట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. స్వచ్ఛంద సంస్థ ఇచ్చిన సమాచారంతో హోటల్‌పై దాడి చేసిన పోలీసులు ఓ మహిళను అరెస్టు చేయగా, మరో నిందితుడి కోసం గాలిస్తున్నారు. రక్షించిన నటిని ముంబైలోని రెస్క్యూ ఫౌండేషన్‌కు తరలించారు.

హోర్ముజ్ జలసంధిలో నౌకలపై దాడులు

- ఒక నౌకపై డ్రోన్.. మరో నౌకపై క్షిపణి దాడి
- తొమ్మిది మంది భారతీయ నావికుల రక్షణ • ఇద్దరు గల్లంతు



టెహ్రాన్ : హోర్ముజ్ జలసంధిలో వాణిజ్య నౌకలపై దాడులు కలకలం రేపుతున్నాయి. ఆదివారం ఎంటీ పెట్రో డాల్ఫిన్ నౌకపై డ్రోన్ దాడి జరగ్గా, మరోవైపు ఎంటీ వాల్దెరా నౌకపై క్షిపణి దాడి జరిగినట్లు సమాచారం. ఈ రెండు నౌకల్లోనూ కలిపి 22 మంది భారతీయ నావికులు ఉన్నట్లు తెలుస్తోంది. ఒమన్‌లోని సోహార్ నౌకాశ్రయం సమీపంలో నికరగువ జెండాతో ప్రయాణిస్తున్న ఎంటీ పెట్రో డాల్ఫిన్ నౌకపై జరిగిన దాడిలో తొమ్మిది మంది భారతీయ నావికులను రక్షించగా, మరో ఇద్దరు గల్లంతయ్యారు. గల్లంతైన వారి ఆచూకీ కోసం స్థానిక సంస్థల సహకారంతో గాలింపు చర్యలు చేపట్టినట్లు ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. ఇదిలా ఉండగా, మార్షల్ ఐలాండ్స్ జెండాతో ప్రయాణిస్తున్న ఎంటీ వాల్దెరా నౌకపై కూడా క్షిపణి దాడి జరిగినట్లు సమాచారం వెలువడింది. ఈ నౌకలో ఉన్న 11 మంది భారతీయ నావికుల భద్రతపై ఆరా తీస్తున్నట్లు కేంద్ర మంత్రి సర్బానంద తెలిపారు. అయితే, ఈ దాడులకు పాల్పడింది ఎవరనే విషయం ఇంకా స్పష్టంగా తెలియరాలేదు. వాణిజ్య, ఇంధన రవాణా నౌకలపై జరుగుతున్న దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. పౌర నౌకలు, ఇంధన రవాణా నౌకలపై దాడులను తక్షణమే నిలిపివేయాలని సూచించింది.<

నేహా బోరా అనుకుని మరో మహిళను గుర్తించిన పోలీసులు

- ఒకేలా కనిపించే ఇద్దరు మహిళలు
- నిరసనల్లో ఆసక్తికర పరిణామం
- చివరకు విజయ్ చౌక్ వద్ద అసలైన నేహా బోరా అదుపులోకి



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో ఆదివారం జరిగిన నిరసనల సందర్భంగా ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. ముఖానికి మాస్కు ధరించిన ఓ మహిళను చూసిన పోలీసులు ఆమె ఆల్ ఇండియా స్టూడెంట్స్ అసోసియేషన్ (ఏఐఎస్ఏ) అధ్యక్షురాలు నేహా బోరా అని భావించారు. అయితే, తాము అదుపులోకి తీసుకోవాలనుకున్న అసలు వ్యక్తి ఆమె కాదని ఆ తర్వాత గుర్తించారు. కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్‌కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నిర్వహించిన నిరసనల సందర్భంగా ఈ ఘటన జరిగింది. ఢిల్లీలోని ఆర్కే ఆశ్రమం వద్ద నేహా బోరాను పోలిన మహిళ కనిపించడంతో పోలీసులు పొరబడ్డారు. ఇదే సమయంలో అసలైన నేహా బోరా కన్నాట్ ప్లేస్ ప్రాంతంలో నిరసనలో పాల్గొన్నారు. తనను పోలిన మరో మహిళతో కలిసి ఉన్న ఫొటోను అనంతరం సామాజిక మాధ్యమాల్లో పంచుకున్న నేహా బోరా.. 'ఇది యాదృచ్ఛికం' అంటూ వ్యాఖ్యానించారు. ఒకేలా కనిపించే ఇద్దరు మహిళల కారణంగా పోలీసులు తొలుత పొరబడిన ఈ ఘటన చర్చనీయాంశమైంది. చివరకు అసలైన నేహా బోరాను విజయ్ చౌక్ వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.







ధారావిలో పునరావాస ఇళ్ల నిర్మాణం షురూ

- ముంబైలో 10,432 ఇళ్లకు భూమిపూజ
- మాతుంగలో 22 ఎకరాల్లో 10 భారీ టవర్లు
- ఒక్కో కుటుంబానికి 350 చదరపు అడుగుల ఇల్లు
- 2030 ఆగస్టు నాటికి మూడు దశల్లో అప్పగింత

ముంబై: ఆసియాలోనే అతిపెద్ద మురికివాడల్లో ఒకటైన ధారావి పునరాభివృద్ధి ప్రాజెక్టులో కీలక ముందడుగు పడింది. ధారావి నివాసులకు పునరావాసం కల్పించేందుకు ముంబయిలోని మాతుంగలో 22 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించనున్న 10,432 ఇళ్ల ప్రాజెక్టుకు అదానీ ఎంటర్‌ప్రైజెస్ డైరెక్టర్ ప్రణవ్ అదానీ సోమవారం భూమిపూజ చేశారు. ఈ ప్రాజెక్టులో మొత్తం 10 భారీ టవర్లతోపాటు 1,379 వాణిజ్య, పారిశ్రామిక యూనిట్లను నిర్మించనున్నారు. ధారావి పునరాభివృద్ధి ప్రాజెక్టు కోసం ఏర్పాటు చేసిన అదానీ నవభారత్ డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ (ఏఎన్‌డీపీఎల్) ఈ నిర్మాణాలను చేపడుతోంది. పునరావాస పథకం కింద అర్హులైన నివాసులకు 350 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇళ్లను కేటాయించనున్నారు. తొలుత ధారావిలోని 6, 1వ సెక్టార్లకు చెందిన అర్హులకు ఇళ్లు అందించనున్నారు. అనంతరం ప్రాధాన్య క్రమంలో ఇతర అర్హుల కోసం దాదాపు 4,500 ఇళ్లను కేటాయిస్తారు.

మూడు దశల్లో పూర్తి

మహారాష్ట్ర ప్రభుత్వానికి చెందిన ధారావి పునరాభివృద్ధి ప్రాజెక్టు, మురికివాడల పునరావాస ప్రాధికార సంస్థకు (డీఆర్‌పీ/ఎస్ఆర్ఏ) మూడు దశల్లో టవర్లను అప్పగించనున్నారు. తొలి ఐదు టవర్లను 2029 మార్చి నాటికి, మరో రెండు టవర్లను అదే ఏడాది ఆగస్టు నాటికి, మిగిలిన మూడు టవర్లను 2030 ఆగస్టు నాటికి అప్పగించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి టవర్‌లో 37 నుంచి 39 అంతస్తులు ఉంటాయి. నివాసితుల కోసం 10 నుంచి 12 ప్యాసింజర్ లిఫ్టులు, రెండు ప్రత్యేక ఫైర్ లిఫ్టులను ఏర్పాటు చేయనున్నారు. వాణిజ్య, పారిశ్రామిక యూనిట్ల కోసం మరో రెండు లిఫ్టులు నిర్మిస్తారు. చిన్నారుల సంరక్షణ కేంద్రం, కమ్యూనిటీ హాల్, పోడియం గార్డెన్లు, కూర్చునేందుకు ప్రత్యేక ప్రదేశాలు, సొసైటీ కార్యాలయాలు, ప్రార్థనా స్థలాలు వంటి సౌకర్యాలను కల్పించనున్నారు. ప్రతి పునరావాస భవనంలోని వాణిజ్య స్థలంలో 10 శాతాన్ని ఉమ్మడి మౌలిక సదుపాయాల నిర్వహణకు ఆదాయం సమకూర్చేలా కేటాయిస్తారు. ఇళ్ల అప్పగింత అనంతరం పదేళ్ల పాటు భవనాలు, ఉమ్మడి మౌలిక సదుపాయాల నిర్వహణ బాధ్యతను ఏఎన్‌డీపీఎల్ చేపట్టనుంది. ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ అదనపు ప్రధాన కార్యదర్శి అసీమ్ కుమార్ గుప్తా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఆర్‌పీ/ఎస్ఆర్ఏ సీఈఓ మహేంద్ర కల్యాంకర్ కూడా పాల్గొన్నారు. ధారావి కుటుంబాలకు సురక్షితమైన, ఆధునిక గృహాలతోపాటు మెరుగైన జీవన ప్రమాణాలకు అవసరమైన సౌకర్యాలు అందించడమే లక్ష్యమని కల్యాంకర్ పేర్కొన్నారు.

15 నిమిషాల్లోనే అవసరమైన సేవలు

ధారావి పునరాభివృద్ధి ప్రణాళికలో భాగంగా నివాసాలతోపాటు దుకాణాలు, పాఠశాలలు, వైద్య సదుపాయాలు, పార్కులు, ప్రార్థనా స్థలాలు, ప్రజా రవాణా తదితర సౌకర్యాలతో సమగ్ర టౌన్‌షిప్‌ను అభివృద్ధి చేయనున్నారు. నివాసితులకు అవసరమైన సేవలు 15 నిమిషాల నడక దూరంలో అందుబాటులో ఉండేలా ప్రణాళిక రూపొందించారు. ఇందులో భాగంగా గాంధీ జయంతి సందర్భంగా మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్ ధారావి ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌ను ప్రారంభించారు. 22,500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రంలో నమూనా ఇళ్లు, త్రీడీ వాక్‌త్రూ, నివాసాలు, పని ప్రదేశాలు, రవాణా, ఇతర సౌకర్యాలకు సంబంధించిన ప్రదర్శనల ద్వారా పునరాభివృద్ధి ప్రణాళికను ప్రజలకు పరిచయం చేస్తున్నారు. పది లక్షల మందికి పైగా నివసించే ధారావిలో గృహ వసతులు, పౌర మౌలిక సదుపాయాలను మెరుగుపరచడంతోపాటు స్థానిక ఉపాధి, వ్యాపారాలకు మద్దతు ఇవ్వడం ఈ ప్రాజెక్టు ప్రధాన లక్ష్యంగా ఉంది.



పాక్‌లో రాజకీయ అగ్గి.. గవర్నర్ హౌస్‌కు నిప్పు

- ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలో అత్యవసర పరిస్థితిపై భగ్గుమన్న నిరసనలు
- పలుచోట్ల కాల్పుల కలకలం

పాకిస్థాన్ : పాకిస్థాన్‌లో రాజకీయ సంక్షోభం తీవ్రరూపం దాల్చింది. ఖైబర్ పఖ్తున్‌ఖ్వా ప్రావిన్స్‌లో అత్యవసర పరిస్థితి విధించడంతో ప్రారంభమైన నిరసనలు హింసాత్మకంగా మారాయి. ఆందోళనకారులు గవర్నర్ హౌస్‌కు నిప్పుపెట్టడంతో భవనం మంటల్లో చిక్కుకున్న దృశ్యాలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. మరోవైపు పలు నగరాల్లో పోలీసులు కాల్పులు జరుపుతున్నట్లుగా కనిపిస్తున్న వీడియోలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. పరిస్థితులు అదుపు తప్పుతుండటంతో ప్రావిన్స్‌లో శాంతిభద్రతలపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. జైలులో ఉన్న మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్–ఎ–ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ నేతృత్వంలోని ప్రావిన్షియల్ ప్రభుత్వాన్ని పక్కనపెడుతూ కేంద్ర ప్రభుత్వం అత్యవసర పరిస్థితి విధించింది. ఈ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఆదివారం పెద్దసంఖ్యలో ప్రజలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. ఇస్లామాబాద్ వరకు పీటీఐ తలపెట్టిన ర్యాలీకి సైతం భద్రతా చర్యల కారణంగా ఆటంకాలు ఎదురయ్యాయి. అయితే గవర్నర్ హౌస్‌కు మంటలు ఎలా అంటుకున్నాయి, ఎంతమేర ఆస్తి నష్టం సంభవించింది, ఈ ఘటనలో ఎవరైనా ప్రాణాలు కోల్పోయారా అనే వివరాలు ఇంకా వెల్లడికాలేదు. ప్రభుత్వ అణచివేత చర్యల్లో భాగంగా స్వాబీలో 59 మంది పీటీఐ కార్యకర్తలను, ఖైబర్ జిల్లాలో మరో ఆరుగురిని అరెస్టు చేసినట్లు స్థానిక మీడియా కథనాలు వెల్లడించాయి. మాజీ ముఖ్యమంత్రి సోహైల్ అఫ్రిది, పీటీఐ ప్రావిన్షియల్ అధ్యక్షుడు జునైద్ అక్బర్‌ను సైతం అదుపులోకి తీసుకున్నట్లు వార్తలు వెలువడ్డాయి. ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ప్రావిన్స్‌లోని ప్రధాన కూడళ్లు, జాతీయ రహదారులపై భద్రతా బలగాలను మోహరించారు. స్వాబీలో మొబైల్ ఫోన్ సేవలతో పాటు పాకిస్థాన్ టెలికమ్యూనికేషన్ కంపెనీ లిమిటెడ్ (పీటీసీఎల్) ఇంటర్నెట్ సేవలను నిలిపివేసినట్లు వార్తలు వచ్చాయి. ప్రావిన్షియల్ పాలనపై పట్టు సాధించేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిన నేపథ్యంలో ఈ పరిణామాలు చోటుచేసుకున్నాయి. కేంద్ర ప్రభుత్వం విధించిన గవర్నర్ పాలనను ప్రతిపక్ష పార్టీలు తీవ్రంగా వ్యతిరేకించాయి. ఈ చర్య ప్రజాస్వామ్యంపై దాడి అని అభివర్ణించాయి. తాజా పరిణామాలతో ఖైబర్ పఖ్తున్‌ఖ్వాలో రాజకీయ అనిశ్చితి మరింత తీవ్రమవగా, శాంతిభద్రతల పరిస్థితిపై ఉత్కంఠ నెలకొంది.

ఉత్తర కొరియా క్షిపణి పరీక్షలతో కలకలం

సియోల్ : ఉత్తర కొరియా తన ఆయుధ సంపత్తిని మరింత పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా తాజాగా పలు బాలిస్టిక్ క్షిపణులను పరీక్షించినట్లు దక్షిణ కొరియా సైన్యం ఆరోపించింది. తూర్పు సముద్ర జలాల వైపు ఉత్తర కొరియా క్షిపణులను ప్రయోగించినట్లు వెల్లడించింది. ఇప్పటికే ఉత్తర, దక్షిణ కొరియాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో ఈ పరీక్షలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. దక్షిణ కొరియా సంయుక్త దళాల ప్రతినిధి జాంగ్ డో యుంగ్ మాట్లాడుతూ.. ఉత్తర కొరియా రాజధాని ప్యోంగ్యాంగ్ నుంచి పలు రకాల క్షిపణులను ప్రయోగించినట్లు తెలిపారు. గత కొన్నేళ్లుగా ఉత్తర కొరియా తన ప్రధాన విమానాశ్రయాన్ని కీలక క్షిపణి ప్రయోగ కేంద్రంగా ఉపయోగించుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఉత్తర కొరియా పరీక్షించిన ఓ క్షిపణి సుమారు 900 కిలోమీటర్ల దూరం ప్రయాణించినట్లు జాంగ్ వెల్లడించారు. అయితే, మొత్తం ఎన్ని క్షిపణులను గుర్తించారనే విషయాన్ని ఆయన స్పష్టం చేయలేదు. మరోవైపు, జపాన్ ఉప రక్షణ మంత్రి తకాషి కోయరి మాట్లాడుతూ.. 17 నిమిషాల వ్యవధిలో రెండు క్షిపణులను గుర్తించినట్లు తెలిపారు. అవి జపాన్ ప్రత్యేక ఆర్థిక మండలి వెలుపల ఉన్న సముద్ర జలాల్లో పడినట్లు వివరించారు. తొలి క్షిపణి సుమారు 220 కిలోమీటర్ల ప్రయాణించగా, రెండో క్షిపణి దాదాపు 910 కిలోమీటర్ల దూరం వెళ్లినట్లు వెల్లడించారు. ఉత్తర కొరియా హైపర్‌సోనిక్ ఆయుధాన్ని పరీక్షించి ఉండవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రయోగాల వల్ల విమానాలకు, నౌకలకు ఎలాంటి ముప్పు వాటిల్లలేదని స్పష్టం చేశారు. అణ్వాయుధాలను మోసుకెళ్లగల సామర్థ్యం కలిగిన ఆయుధాలను అభివృద్ధి చేసేందుకు ఉత్తర కొరియా చాలా కాలంగా ప్రయత్నిస్తోంది. ఈ నేపథ్యంలో తాజా క్షిపణి పరీక్షలు కొరియా ద్వీపకల్పంలో భద్రతాపరమైన ఆందోళనలను మరింత పెంచుతున్నాయి.

జిబౌతీ సముద్ర జలాల్లో పడవ బోల్తా

- 139 మంది మృతి
- యెమెన్‌కు 350 మంది వలసదారుల ప్రయాణం
- 15 మంది చిన్నారులు మృత్యువాత
- 116 మందికి పైగా గల్లంతు

ఒబాక్ : ఆఫ్రికాలోని జిబౌతీ సముద్ర జలాల్లో ఘోర పడవ ప్రమాదం చోటుచేసుకుంది. యెమెన్‌కు సుమారు 350 మంది వలసదారులతో వెళ్తున్న పడవ బోల్తా పడటంతో 139 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో 15 మంది చిన్నారులు ఉన్నారు. మరో 116 మందికి పైగా గల్లంతైనట్లు సమాచారం. ఈ ప్రమాదం నుంచి 80 మందికి పైగా ఇథియోపియా పౌరులు ప్రాణాలతో బయటపడినట్లు తెలుస్తోంది. ప్రాణాలతో బయటపడిన వారు తెలిపిన వివరాల ప్రకారం.. జిబౌతీలోని ఓడరేవు పట్టణమైన ఒబాక్‌కు ఉత్తరాన గుహారే సమీపంలో రాత్రి వేళ ఈ దుర్ఘటన జరిగింది. వలసదారులతో ప్రయాణిస్తున్న పడవ బోల్తా పడటంతో పలుపురు సముద్రంలో మునిగిపోయారు. గల్లంతైన వారి ఆచూకీపై ఆందోళన నెలకొంది. అయితే, పడవ ప్రమాదానికి గల కారణాలు ఇంకా తెలియరాలేదు.





మందుపాతర పేలి నలుగురు ఉగ్రవాదులు మృతి

- పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ దాటి చొరబాటు యత్నం
- మృతుల్లో లష్కరే తొయిబా కీలక కమాండర్

శ్రీనగర్ : జమ్ముకశ్మీర్‌లోని పూంచ్ జిల్లాలో నియంత్రణ రేఖ దాటి భారత్‌లోకి చొరబడేందుకు ప్రయత్నించిన నలుగురు ఉగ్రవాదులు మందుపాతర పేలి మరణించినట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. అయితే, ఈ ఘటనను భారత సైన్యం అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. అధికార వర్గాల సమాచారం ప్రకారం.. పూంచ్ జిల్లాలోని కృష్ణఘాటి సెక్టార్ పరిధిలో ఉన్న నంగి తక్రీ ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటుచేసుకుంది. నియంత్రణ రేఖ దాటి భారత భూభాగంలోకి ప్రవేశించేందుకు ప్రయత్నిస్తున్న సమయంలో ఉగ్రవాదులు మందుపాతరను తాకినట్లు తెలుస్తోంది. దీంతో భారీ పేలుడు సంభవించి, ఆ బృందంలోని నలుగురూ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. మృతుల్లో లష్కరే తొయిబాకు చెందిన కీలక కమాండర్ మహమ్మద్ ఫైజాన్‌తో పాటు మహమ్మద్ ఇష్తియాక్, మహమ్మద్ వకాస్, మహమ్మద్ ఆసిమ్ ఉన్నట్లు గుర్తించినట్లు సమాచారం. వీరంతా పాకిస్థాన్ ఆక్రమిత జమ్ముకశ్మీర్‌లోని హజీరా తహసీల్ పరిధికి చెందినవారిగా భావిస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు, మృతుల గుర్తింపుపై అధికారిక ధ్రువీకరణ రావాల్సి ఉంది.

పాక్‌లో శిక్షణ విమానం కూలి ఇద్దరు ఆర్మీ పైలట్లు మృతి

- క్వెట్టా ప్రాంతంలో ప్రమాదం..
- సాంకేతిక లోపంతో కూలిన ముషాక్ విమానం

ఇస్లామాబాద్ : పాకిస్థాన్‌లో ఘోర విమాన ప్రమాదం చోటుచేసుకుంది. పాకిస్థాన్ సైన్యానికి చెందిన శిక్షణ విమానం సాంకేతిక సమస్యతో కూలిపోవడంతో ఇద్దరు ఆర్మీ పైలట్లు ప్రాణాలు కోల్పోయారు. బలోచిస్థాన్ రాజధాని క్వెట్టా ప్రాంతంలో ఈ ప్రమాదం జరిగినట్లు పాకిస్థాన్ సైన్యం వెల్లడించింది. ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ముషాక్ శిక్షణ విమానం సాంకేతిక లోపం కారణంగా కూలిపోయినట్లు అధికారులు తెలిపారు. ఈ ప్రమాదంలో మేజర్ హుస్సేన్ షెహజాద్ హుమయూన్, శిక్షణా బోధకుడు కెప్టెన్ అబ్దుల్ సమద్ మృతిచెందినట్లు వెల్లడించారు. ఈ ఘటనపై దేశాధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, ప్రధానమంత్రి షెహబాజ్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రాణాలు కోల్పోయిన పైలట్ల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఇదిలా ఉండగా, పాకిస్థాన్ సైనిక విమానయాన విభాగంలో గతంలోనూ ప్రమాదాలు చోటుచేసుకున్నాయి. జూన్‌లో పాకిస్థాన్ ఆర్మీ ఏవియేషన్‌కు చెందిన ఎంఐ–17 హెలికాప్టర్ ముజఫర్ బాద్‌లో కూలిపోయిన ఘటనలో అందులోని సిబ్బంది మొత్తం మృతిచెందిన విషయం తెలిసిందే. తాజాగా మరో శిక్షణ విమానం ప్రమాదానికి గురై ఇద్దరు పైలట్లు ప్రాణాలు కోల్పోవడం పాకిస్థాన్ సైన్యంలో విషాదాన్ని నింపింది.

సీజేఐపై కాంగ్రెస్ వివాదాస్పద వ్యాఖ్యలు

- శాంతిభద్రతలు మీ పరిధిలో లేకుంటే రాజీనామా చేయండి
- కేరళ కాంగ్రెస్ 'ఎక్స్' పోస్టు.. విమర్శలతో తొలగింపు

న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీలో కొనసాగుతున్న నిరసనలు, ఆంక్షలపై భారత ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) సూర్యకాంత్ స్పందిస్తూ.. శాంతిభద్రతల అంశం న్యాయవ్యవస్థ పరిధిలోకి రాదని స్పష్టం చేశారు. మరోవైపు, కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై పలు ఆరోపణలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించేందుకు కాంగ్రెస్ నేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ కోరిన వ్యక్తిగత భేటీకి ఆయన నిరాకరించారు. న్యాయస్థానంలో విచారణలో ఉన్న అంశాలపై బయట సమావేశాలు నిర్వహించడం రాజ్యాంగ సూత్రాలకు, న్యాయ నైతికతకు విరుద్ధమని తేల్చిచెప్పారు. ఈ నేపథ్యంలో సీజేఐ వ్యాఖ్యలపై కేరళ కాంగ్రెస్ విభాగం సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్'లో తీవ్రంగా స్పందించింది. శాంతిభద్రతలు మీ పరిధిలోని అంశం కానప్పుడు వెంటనే పదవికి రాజీనామా చేయాలని, ఆ బాధ్యతలను సమర్థంగా నిర్వహించగల మరొకరిని తాము ఎంపిక చేసుకుంటామని పేర్కొంటూ వివాదాస్పద పోస్టు చేసింది. దేశ అత్యున్నత న్యాయస్థానానికి నాయకత్వం వహిస్తున్న సీజేఐపై ఈ విధమైన వ్యాఖ్యలు చేయడంపై విమర్శలు వెల్లువెత్తాయి. దీంతో కేరళ కాంగ్రెస్ విభాగం కొద్ది గంటల్లోనే ఆ పోస్టును తొలగించింది. సీజేఐ వ్యాఖ్యలు, కాంగ్రెస్ విభాగం స్పందనతో ఈ వ్యవహారం రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది.

నేపాలీ కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా బినోద్ చౌదరీ

- 15వ పార్టీ మహాసభల్లో ఎన్నిక
- మరో ఇద్దరికి ఉపాధ్యక్షులుగా అవకాశం

కాఠ్మాండు: నేపాల్‌కు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, ఆ దేశ ఏకైక బిలియనీర్‌గా గుర్తింపు పొందిన బినోద్ చౌదరీ నేపాలీ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. ఆయనతో పాటు చంద్ర భండారీ, మధు ఆచార్య కూడా ఉపాధ్యక్షులుగా ఎన్నికైనట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. పార్టీ 15వ మహాసభల్లో భాగంగా మూడు ఉపాధ్యక్ష పదవులకు ఎన్నికలు నిర్వహించగా, ఫలితాలను తాజాగా ప్రకటించారు. నేపాల్‌లో ప్రముఖ వ్యాపారవేత్తగా గుర్తింపు పొందిన బినోద్ చౌదరీ గ్రూప్ సంస్థల చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. వ్యాపార రంగంలో తనదైన ముద్ర వేసిన ఆయనకు దేశవ్యాప్తంగా గుర్తింపు ఉంది. నేపాల్ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న నేపాలీ కాంగ్రెస్ పార్టీలో ఆయనకు ఉపాధ్యక్ష పదవి దక్కడం ప్రాధాన్యం సంతరించుకుంది. పార్టీ 15వ మహాసభలు అక్టోబర్ 4న ప్రారంభమయ్యాయి. ఈ మహాసభల్లో భాగంగా కేంద్ర కార్యనిర్వాహక కమిటీలోని 232 మంది సభ్యులను ఎంపిక చేశారు. వీరిలో 171 మందిని ఎన్నికల ద్వారా ఎన్నుకోగా, మిగిలిన 61 మందిని పార్టీ అధ్యక్షుడు నామినేట్ చేయనున్నారు. పార్టీ పదాధికారుల జాబితాలో ఒక అధ్యక్షుడు, ఒక సీనియర్ ఉపాధ్యక్షుడు, ముగ్గురు ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, 13 మంది సంయుక్త కార్యదర్శులు ఉంటారు. తాజా ఎన్నికలతో పార్టీ నాయకత్వంలో కొత్త పదవుల భర్తీ ప్రక్రియలో మరో కీలక ఘట్టం పూర్తయింది.

అభిషేక్ శర్మపై 'ప్లాన్–బి'..

పనిచేయలేదు

వెస్టిండీస్ ఆల్‌రౌండర్ స్ప్రింగర్



ఇండోర్: వెస్టిండీస్‌తో జరిగిన మూడో టీ20లో భారత్ విజయం సాధించి సిరీస్‌లో ఆధిక్యంలోకి వెళ్లింది. ఇండోర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో టీమ్‌ఇండియా ఓపెనర్ అభిషేక్ శర్మ (69; 30 బంతుల్లో 6×4, 5×6) ధనాధన్ ఇన్నింగ్స్‌తో మెరిపించాడు. అతడి బ్యాటింగ్‌పై వెస్టిండీస్ ఆల్‌రౌండర్ షమార్ స్ప్రింగర్ మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. అభిషేక్ కోసం తమ టీమ్ 'ప్లాన్–బి'ని అమలు చేసిందని, అయితే అది పనిచేయలేదని అన్నాడు.

''అభిషేక్ వరల్డ్ క్లాస్ ఆటగాడు. అతడి బ్యాటింగ్ అద్భుతంగా ఉంది. ఈ మ్యాచ్‌లో అభిషేక్ కోసం మేం ప్లాన్–బిని ఉపయోగించాం. అతడి విషయంలో రక్షణాత్మకంగా ఉంటూ.. సాధ్యమైనంత మేర సింగిల్స్, డబుల్స్‌కే పరిమితం చేయాలనుకున్నాం. అయితే, అది అంతగా పనిచేయలేదు. అభిషేక్ మొదటి నుంచి దూకుడుగా ఆడటం భారత్ జట్టుకు కలిసొచ్చింది'' అని స్ప్రింగర్ వ్యాఖ్యానించాడు. ఇక, లక్ష్య ఛేదనలో భారత బౌలర్లు రాణించారని కరేబియన్ ఆల్‌రౌండర్ అన్నాడు. తాము కొన్ని బంతులను పరుగులుగా మల్చలేకపోయామని, అప్పుడే గేమ్ తమకు దూరమైందని అభిప్రాయపడ్డాడు. మరోవైపు, వెస్టిండీస్ ప్లాన్‌పై అభిషేక్ శర్మ కూడా స్పందించాడు. ''నా విషయంలో వారు ప్రణాళిక మార్చుకున్నారని అర్థమైంది. అందుకే ఆఫ్ స్పిన్నర్‌తో ఆ జట్టు బౌలింగ్ దాడిని ప్రారంభించింది. అందుకు తగినట్లుగానే తొలి ఓవర్‌లో బౌలర్ అద్భుతంగా బంతులేశాడు. అయితే, పవర్‌ప్లేలో నేను తక్కువ పరుగులు చేస్తే టీమ్‌కు నష్టమని తెలుసు. అందుకే వారి వ్యూహం కంటే మెరుగ్గా ఆడక తప్పదని అర్థమైంది'' అని టీమ్‌ఇండియా ఓపెనర్ వివరించాడు. వెస్టిండీస్ విధ్వంసక జట్టు అని, వారితో ఆడుతున్నప్పుడు ఎప్పుడూ అలసత్వం ప్రదర్శించడం సరికాదని అభిషేక్ అన్నాడు.



ఉప్పల్ మ్యాచ్‌కు భారీ బందోబస్తు

- 408 కెమెరాలు, 8 షీ టీమ్స్ నిఘా
- వెస్టిండీస్‌తో నాలుగో టీ20 మ్యాచ్ కోసం భారత్ రెడీ



ప్రజానావ, హైదరాబాద్: భారత్– వెస్టిండీస్ మధ్య నాలుగో టీ20 అక్టోబర్ 14న (బుధవారం) జరగనుంది. ఈ మ్యాచ్‌కు హైదరాబాద్ ఉప్పల్ స్టేడియం వేదిక కానుంది. ఇందుకోసం టీమ్‌ఇండియా జట్టు తాజాగా హైదరాబాద్ చేరుకుంది. రాజధాని నగరంలో టీమ్‌ఇండియా ఇంటర్నేషనల్ మ్యాచ్ ఆడనుండడంతో తెలుగు రాష్ట్రాల్లో ఫ్యాన్స్ను క్రికెట్ ఫీవర్ పట్టుకుంది. మరి ఇప్పటిదాకా ఎన్ని టికెట్లు అమ్ముడ య్యాయి? అధికారులు ఎలాంటి ఏర్పాట్లు చేస్తున్నారు?

2200 మంది పోలీసులతో బందోబస్తు

ఉప్పల్ స్టేడియంలో సీటింగ్ కెపసిటీ గరిష్ఠంగా 55 వేలు. అంతమంది ఇక్కడ మ్యాచ్‌ను వీక్షించే అవకాశం ఉంది. అయితే బుధవారం జరగనున్న ఈ మ్యాచ్‌కు సంబంధించి ఇప్పటి దాకా 25000 టికెట్లు అమ్ముడైనట్లు హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తాజాగా వెల్లడించింది. ఇంకా టికెట్ సేన్ జరుగుతుండడంతో 40 వేల దాకా అభిమానులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే ఈ మ్యాచ్ కోసం పటిష్ఠమైన భద్రతా ఏర్పాట్లు, భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు మల్కాజిగిరి సీపీ సుమతి వెల్లడించారు. ఇందుకోసం 2,200 మంది పోలీసులు విధుల్లో ఉండనున్నట్లు చెప్పారు. బ్లాక్ టికెట్ల సేల్‌పైనా ప్రత్యేక నిఘా ఉంటుందని అధికారులు తెలిపారు. అంతేకాకుండా నిఘా కోసం స్టేడియం చుట్టూ 4 వాచ్ టీమ్‌లు, 408 సీసీ కెమెరాలు, 2 డ్రోన్ కెమెరాలతో పర్యవేక్షణ ఉంటుందని అధికారులు తెలిపారు. ఇక మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అందుకోసం 8 షీ టీమ్స్ మఫ్టీలో ఉంటాయని సీపీ పేర్కొన్నారు. వీళ్లంతా ప్రేక్షకుల భద్రత కోసం సమన్వయంతో పనిచేస్తున్నారని అన్నారు. దాదాపు 8 వేల వాహనాలు నిలిపి ఉంచేలా పార్కింగ్ కోసం స్థలం ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఇక బంజారాహిల్స్ హోటల్ నుంచి ప్లేయర్లు స్టేడియానికి రానున్నారు.

ఆర్టీసీ, మెట్రో సేవలు వినియోగించుకోవాలి

కాగా, మ్యాచ్ కోసం అభిమానులను మధ్యాహ్నం 2 గంటల నుంచే స్టేడియంలోకి అనుమతిస్తామని సీపీ చెప్పారు. అయితే స్టేడియానికి వచ్చే అభిమానులు ఆర్టీసీ, మెట్రో సేవలను ఉపయోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు. మ్యాచ్ నేపథ్యంలో స్టేడియం పరిసరాల్లో ట్రాఫిక్ మళ్లింపులు ఉంటాయని పౌరులు నిబంధనలను పాటించాలని కోరారు.


ఎలా ఉన్నారు?

హైదరాబాద్– ఇషాన్ కిషన్ తెలుగు

ఇక ఈ మ్యాచ్ కోసం సోమవారం సాయంత్రమే భారత క్రికెట్ జట్టు హైదరాబాద్‌కు చేరుకుంది. ఈ ప్రయాణంలో విమానంలో జరిగిన ఓ సరదా సన్నివేశాన్ని యువ క్రికెటర్ ఇషాన్ కిషన్ షేర్ చేసుకున్నాడు. హైదరాబాద్‌కు వస్తుండడ ంతో ఇక్కడి ప్రేక్షకుల కోసం తెలుగులో మాట్లాడుతూ ఓ సెల్ఫీ వీడియో రికార్డ్ చేశాడు. హలో! హైదరాబాద్, ఎలా ఉన్నారు? అని ఇషాన్ సరదాగా అన్నాడు. ఈ వీడియోలో అతడి పక్కన తెలుగు క్రికెటర్లు తిలక్ వర్మ, నితీశ్ కుమార్ రెడ్డి ఉన్నారు. కాగా, ఐపీఎల్‌లో ఇషాన్ మన సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్టుకే ఆడుతున్నాడు. అందుకే అతడు ఉప్పల్ స్టేడియాన్ని హోమ్ గ్రౌండ్‌లాగా భావిస్తాడు.

జడేజాను ఔట్ చేసిన జడేజా

- రంజీ ట్రోఫీలో ఆసక్తికర సన్నివేశం



రాజ్‌కోట్: టీమ్‌ఇండియా స్టార్ ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా 2026– 27 రంజీ ట్రోఫీ తొలి మ్యాచ్‌లో సూపర్ సెంచరీతో ఆకట్టుకున్నాడు. గ్రూప్ బీలో భాగంగా రాజ్‌కోట్ వేదికగా ఛత్తీస్‌గఢ్‌తో జరుగుతున్న మ్యాచ్‌లో ఈ సౌరాష్ట్ర ఆల్‌రౌండర్ మొదటి ఇన్నింగ్స్‌లో 102 పరుగులతో సత్తా చాటాడు. అతడికి ఫస్ట్ క్లాస్ కెరీర్‌లో ఇది 16వ సెంచరీ కావడం విశేషం. అయితే ఇదే మ్యాచ్‌లో ఓ అరుదైన దృశ్యం కనిపించింది. జడేజాను జడేజానే పెవిలియన్ చేర్చడం మ్యాచ్‌లో హైలైట్‌గా నిలిచింది. తొలి ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్ర 151కే నాలుగు వికెట్లు కోల్పోయిన దశలో జడేజా తన అనుభవంతో కీలక ఇన్నింగ్స్ ఆడాడు. అతడు ప్రేరక్ మన్కడ్ (129 పరుగులు)తో జతకలిసి ఐదో వికెట్‌కు 205 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పాడు. ఈ క్రమంలోనే మన్కడ్ శతకం పూర్తి చేసుకున్నాడు. సౌరాష్ట్రకు 392 పరుగుల భారీ స్కోర్ దక్కడానికి ఈ ఈ పార్ట్‌నర్‌షిపే కారణం. అయితే 356 స్కోర్ వద్ద మన్కడ్ ఔట్ అవ్వడంతో మళ్లీ వికెట్ల పతనం మొదలైంది. ఓవైపు జడేజా నిలబడ్డా ఇంకో ఎండ్‌లో వికెట్లు పడుతున్నాయి.

జడేజా 85 పరుగుల వ్యక్తిగత స్కోర్ వద్ద ఉన్నప్పటికే ఆ జట్టు తొమ్మిది వికెట్లు కోల్పోయింది. దీంతో అతడి సెంచరీపై ఉత్కంఠ నెలకొంది. అయినా పట్టు వదలకుండా క్రీజులోనే నిలబడ్డాడు. ఈ క్రమంలోనే 110వ ఓవర్లో 205 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. అయితే ఆ తర్వాతి ఓవర్ ధర్మేంద్రసిన్హా జడేజా బౌలింగ్ చేశాడు. ఆ ఓవర్లో తొలి మూడు బంతులను ఎదుర్కొన్న జడ్డూ నాలుగో బంతికి బౌల్డ్ అయ్యాడు. దీంతో 102 పరుగులకు జడేజా పెవిలియన్‌కు చేరాడు. అయితే ఈ సందర్భంలో బౌలింగ్ చేసిన వ్యక్తి పేరు, ఔటైన బ్యాటర్ పేరు రెండు కూడా జడేజానే కావడం విశేషం.

ఎవరీ ధర్మేంద్రసిన్హా జడేజా

36ఏళ్ల ధర్మేంద్రసిన్హా జడేజా రాజ్‌కోట్‌కు చెందిన క్రికెటర్. 2012లో రంజీల్లో అరంగేట్రం చేశాడు. దేశవాళీలో అనేక మ్యాచ్‌ల్లో ఆడాడు. సౌరాష్ట్ర స్టేట్ జట్టులో నిలదైన బౌలర్‌గా అతడికి పేరుంది. తన కెరీర్‌లో ఇప్పటిదాకా 34 ఫస్ట్ క్లాస్ మ్యాచ్‌ల్లో జడేజా 136 వికెట్లు పడగొట్టాడు. 2018లో సౌతాఫ్రికా ఏతో ఆడాల్సిన సిరీస్ కోసం ఇండియా ఏ జట్టుకు ఎంపికయ్యాడు. అలాగే దేవదార్ ట్రోఫీలో ఇండియా బీ జట్టుకు కూడా సెలక్ట్ అయ్యాడు. కాగా, డొమెస్టిక్‌లో అతడు సౌరాష్ట్ర, వెస్ట్ జోన్, ఇండియా బి, లైకా కోవాయ్ కింగ్స్, బోర్డ్ ప్రెసిడెంట్స్ XI, ఇండియన్ బోర్డ్ ప్రెసిడెంట్స్ XI, రెస్ట్ ఆఫ్ ఇండియా, సూరత్ లయన్స్, ఇండియా గ్రీన్, కచ్ వారియర్స్, ఛత్తీస్‌గఢ్ జట్లకు ప్రాతినిధ్యం వహించాడు. మొదటి ఇన్నింగ్స్‌లో సౌరాష్ట్ర 392 పరుగులకు ఆలౌటైంది. మన్కడ్ (129 పరుగులు), జడేజా (102 పరుగులు), చిరాగ్ జాని (83 పరుగులు) రాణించారు. మిగిలిన బ్యాటర్లు విఫలమయ్యారు. ఛత్తీస్‌గఢ్ బౌలర్లలో దేవ్ ఆదిత్య సింగ్ ఐదు వికెట్ల ప్రదర్శనతో ఆకట్టుకున్నాడు. రుద్ర ప్రతాప్ దెహరి, ధర్మేంద్రసిన్హా జడేజా చెరో 2, సందీప్ వారియర్ 1 వికెట్ దక్కించుకున్నారు.

భారత్–శ్రీలంక మ్యాచ్ వేదిక మార్పు వార్తలు

స్పందించిన బీసీసీఐ



ముంబై: భారత్– శ్రీలంక మధ్య డిసెంబర్ 13న జరగనున్న తొలి వన్డే మ్యాచ్ వేదికను దిల్లీ నుంచి అహ్మదాబాద్‌కు మారుస్తున్నట్లు వస్తున్న కథనాలను బీసీసీఐ ఖండించింది. నిబంధనల ప్రకారమే ఆ మ్యాచ్‌ను దిల్లీకి కేటాయించారని, వేదిక విషయంలో ఎటువంటి మార్పు చేయలేదని బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. ''దిల్లీలో జరగాల్సిన భారత్– శ్రీలంక తొలి వన్డేను అహ్మదాబాద్‌కు మారుస్తున్నట్లు వస్తున్న వార్తల్లో నిజం లేదు. బీసీసీఐ అలాంటి నిర్ణయమేదీ తీసుకోలేదు. నిర్ణీత ప్రామాణిక విధానాన్ని అనుసరించే ద్వైపాక్షిక మ్యాచ్‌ల వేదికలను కేటాయిస్తారు'' అని సైకియా వివరణ ఇచ్చారు. దిల్లీలోని అరుణ్ జైట్లీ స్టేడియంలో నిర్మాణ పనులు జరుగుతున్నందున.. ఆ మ్యాచ్‌ను అహ్మదాబాద్‌కు మారుస్తున్నారనే ప్రచారం మొదలైంది. ఇదిలా ఉండగా.. భారత్ పర్యటనలో భాగంగా శ్రీలంక జట్టు మూడు వన్డేలతో పాటు మూడు టీ20ల సిరీస్ కూడా ఆడనుంది.

యూట్యూబ్‌లో కోహ్లీ

వీడియోలు చూసి నేర్చుకున్నా

ఆస్ట్రేలియా ఆటగాడు

సిడ్నీ: భారత్–ఎతో ఇటీవల జరిగిన మూడు వన్డేల సిరీస్‌ను ఆస్ట్రేలియా–ఎ జట్టు 2–1 తేడాతో కైవసం చేసుకుంది. ఈ టోర్నీలో ఆసీస్ బ్యాటర్ నాథన్ మెక్‌స్వీనీ ఒక సెంచరీ సహా 194 పరుగులు చేసి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్'గా నిలిచాడు. ఈ క్రమంలోనే అతడు తన విజయ రహస్యాన్ని వెల్లడిస్తూ.. టీమ్‌ఇండియా స్టార్ ప్లేయర్ విరాట్ కోహ్లీ యూట్యూబ్ వీడియోలు చూసి, స్పిన్ బౌలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలో నేర్చుకున్నట్లు తెలిపాడు. ''ఏ విదేశీ జట్టుకైనా భారత్‌లో సిరీస్ గెలవడం అంత సులభమైన విషయం కాదు. భారత్ పర్యటనకు వచ్చినప్పుడు సహజంగానే స్పిన్ బౌలింగ్‌ను ఎదుర్కోవడంపై ఎక్కువ దృష్టి పెట్టాల్సి ఉంటుంది. అందుకే స్పిన్నర్లను కోహ్లీ ఎలా హ్యాండిల్ చేస్తున్నాడో యూట్యూబ్ వీడియోల్లో చూశాను. అలాగే స్టీవ్ స్మిత్‌తోపాటు గతంలో ఇక్కడ రాణించిన ఆస్ట్రేలియన్ ఆటగాళ్ల శైలిని కూడా గమనించాను. అంతేకాకుండా విశ్లేషకుల డేటానూ అధ్యయనం చేశాను. వాటిని మైదానంలో ఆచరణలో పెట్టి.. మంచి ఫలితాలు సాధించడం చాలా సంతోషాన్నిచ్చింది'' అని మెక్‌స్వీనీ చెప్పాడు. అంతకుముందు భారత్–ఎతో జరిగిన అనధికారిక టెస్టు సిరీస్‌లో తన ఆటతీరుపై స్పందిస్తూ.. ''భారత్‌లో ఆడేటప్పుడు తొలి ఇన్నింగ్స్‌కు చాలా ప్రాధాన్యం ఉంటుంది. అయితే.. మ్యాచ్ సాగుతున్న కొద్దీ బ్యాటింగ్ కష్టమైంది. భవిష్యత్తులో భారత్‌లో ఆడే అవకాశం వస్తే టెస్టుల తొలి ఇన్నింగ్స్‌ల్లోనే భారీ స్కోరుపై దృష్టి పెడతాను'' అని తెలిపాడు. రెండు మ్యాచ్‌ల టెస్ట్ సిరీస్‌ను భారత్ 1–0తో గెలుచుకుంది. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో మెక్‌స్వీనీ (0, 35, 34, 36) పెద్దగా రాణించలేకపోయాడు.

హెచ్‌సీఎల్ టెక్ లాభం రూ.5,132 కోట్లు

- క్యూ2లో 21.18శాతం వృద్ధి నమోదు
- రూ.35,620 కోట్లకు చేరిన కార్యకలాపాల ఆదాయం
- త్రైమాసికంలో 6,450 మందికి ఉద్యోగాలు
- ఆంథ్రోపిక్‌తో కృత్రిమ మేధ భాగస్వామ్యం



న్యూఢిల్లీ: ప్రముఖ ఐటీ దిగ్గజం హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం (జులై–సెప్టెంబర్)లో మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. సంస్థ నికర లాభం గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.4,235 కోట్ల నుంచి 21.18 శాతం వృద్ధితో రూ.5,132 కోట్లకు చేరింది. ఈ మేరకు కంపెనీ రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. హెచ్‌సీఎల్ టెక్నాలజీస్ కార్యకలాపాల ఆదాయం గత ఏడాది క్యూ2లోని రూ.31,942 కోట్లతో పోలిస్తే 11.5 శాతం పెరిగి రూ.35,620 కోట్లకు చేరింది. ఐటీ, బిజినెస్ సర్వీసుల ఆదాయం రూ.23,693 కోట్ల నుంచి రూ.26,938 కోట్లకు పెరిగింది. ఇంజినీరింగ్, పరిశోధన–అభివృద్ధి (ఆర్‌అండ్‌డీ) సేవల ఆదాయం రూ.5,423 కోట్ల నుంచి రూ.5,973 కోట్లకు చేరింది. అయితే హెచ్‌సీఎల్ సాఫ్ట్‌వేర్ విభాగం ఆదాయం మాత్రం రూ.2,826 కోట్ల నుంచి రూ.2,709 కోట్లకు తగ్గింది. సెప్టెంబర్ త్రైమాసికంలో సంస్థ 6,450 మందిని కొత్తగా నియమించుకుంది. దీంతో మొత్తం ఉద్యోగుల సంఖ్య 2,23,889 నుంచి 2,30,339కు పెరిగింది. మరోవైపు, కృత్రిమ మేధ (ఏఐ) రంగంలో కార్యకలాపాలను విస్తరించేందుకు ఆంథ్రోపిక్ సంస్థతో భాగస్వామ్యాన్ని కుదుర్చుకుంది. ఈ భాగస్వామ్యంలో భాగంగా తన కార్యకలాపాల్లో క్లౌడ్ ఆధారిత ఏఐ మోడళ్లను వినియోగించుకోనుంది.

ఎల్‌అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్‌లో ఏఐ ల్యాబ్

- ఎన్విడియా సాంకేతికతతో డిజిటల్ ఫ్యాక్టరీ
- రోబోటిక్స్, స్వయంచాలక వ్యవస్థలపై పరిశోధనలు



బెంగళూరు: అక్టోబర్ 12: తయారీ రంగంలో కృత్రిమ మేధ (ఏఐ) వినియోగాన్ని విస్తరించే లక్ష్యంతో ఎల్‌అండ్‌టీ టెక్నాలజీ సర్వీసెస్ (ఎల్‌టీఎస్ఎస్) బెంగళూరులో ఏఐ ఆధారిత ఇంజినీరింగ్ ఇంటెలిజెన్స్ ల్యాబ్‌ను ప్రారంభించింది. ఎన్విడియా సాంకేతికతతో రూపొందించిన ఈ కేంద్రంలో డిజిటల్ ట్విన్స్, పారిశ్రామిక ఏఐ, రోబోటిక్స్, స్వయంచాలక వ్యవస్థల పనితీరును ప్రదర్శించనున్నారు. ఈ ల్యాబ్‌లో ఫ్యాక్టరీల రూపకల్పన, ఉత్పత్తి ప్రణాళిక, నాణ్యత నియంత్రణ, యంత్రాల నిర్వహణకు సంబంధించిన ఏఐ పరిష్కారాలను పరీక్షించవచ్చు. రోబోలు, డ్రోన్లు, డిజిటల్ నమూనాల సమన్వయంతో మానవ జోక్యాన్ని తగ్గించి ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచే మార్గాలను పరిశీలించవచ్చు. ఇంజినీరింగ్, ఏఐ సాంకేతికతలను సమన్వయం చేసి తయారీ రంగానికి ఆచరణాత్మక పరిష్కారాలు అందించడమే లక్ష్యమని సంస్థ సీఈఓ అమిత్ ఛద్దా తెలిపారు.

ఈక్విటీలపై ఎల్‌టీసీజీ పన్ను ఎత్తేయాలి

- విదేశీ పెట్టుబడుల ఉపసంహరణకు అడ్డుకట్ట వేయాలి
- ఎస్‌బీఐ ఆర్థికవేత్తల సూచన
- ఈ ఒక్క నెలలోనే రూ.44,166 కోట్ల ఎఫ్‌పీఐల వెనక్కి
- 2026లో ఇప్పటివరకు రూ.3.04 లక్షల కోట్ల పెట్టుబడుల ఉపసంహరణ



ముంబై: భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడులు భారీగా తరలిపోతున్న నేపథ్యంలో, షేర్లపై దీర్ఘకాలిక మూలధన లాభాల పన్ను (ఎల్‌టీసీజీ)ని రద్దు చేయాలని ఎస్‌బీఐ రీసెర్చ్ ఆర్థికవేత్తలు కేంద్ర ప్రభుత్వానికి సూచించారు. పెట్టుబడులను ఎక్కువ కాలం కొనసాగించేలా, విదేశీ పెట్టుబడుల ప్రవాహంలో ఒడుదొడుకులను తగ్గించేలా విధానపరమైన మార్పులు తీసుకురావాలని పేర్కొన్నారు. ఈక్విటీల్లో పెట్టుబడులను రెండేళ్ల నుంచి మూడేళ్ల వరకు కొనసాగించేలా ప్రోత్సహించడంతోపాటు ఎల్‌టీసీజీ పన్నును ఎత్తివేయాలని సోమవారం విడుదల చేసిన 'ఎకోవ్రాప్' నివేదికలో అభిప్రాయపడ్డారు. భారత ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు (ఎఫ్‌పీఐలు) ఈ అక్టోబర్‌లో ఇప్పటివరకు రూ.44,166 కోట్లను ఉపసంహరించుకున్నారు. దీంతో 2026లో ఇప్పటివరకు వెనక్కి వెళ్లిన పెట్టుబడుల మొత్తం రూ.3.04 లక్షల కోట్లకు చేరింది. ఇది 2025 మొత్తం ఏడాదిలో నమోదైన రూ.1.66 లక్షల కోట్ల ఉపసంహరణ కంటే గణనీయంగా ఎక్కువ. ముడిచమురు ధరలు పెరగడం, అమెరికా డాలర్ బలపడటం, అక్కడి బాండ్లపై రాబడులు అధికం కావడం భారత మార్కెట్లపై విదేశీ పెట్టుబడిదారుల ఆసక్తిని తగ్గిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ఉత్తర ఆసియా మార్కెట్లలో కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత కంపెనీల షేర్లకు డిమాండ్ పెరగడం కూడా విదేశీ పెట్టుబడులు అటువైపు మళ్లడానికి కారణమవుతోందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. అమెరికా వంటి మార్కెట్లలో తక్కువ రిస్క్‌తో మెరుగైన రాబడులు లభించే అవకాశాలు ఉండటంతో ఎఫ్‌పీఐలు భారత ఈక్విటీల నుంచి పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారని చెబుతున్నారు. ప్రస్తుతం ఈక్విటీ పెట్టుబడులపై విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లకు 12.5 శాతం ఎల్‌టీసీజీ పన్ను అమల్లో ఉంది. 2026–27 కేంద్ర బడ్జెట్‌లోనూ ఈ పన్ను రేటును యథాతథంగా కొనసాగించారు. విదేశీ మారకద్రవ్య నిల్వలకు మద్దతునిచ్చేందుకు ఎగుమతుల ద్వారా వచ్చే ఆదాయాన్ని స్వదేశానికి తీసుకురావడంలోనూ సరళమైన విధానం ఉండాలని ఎస్‌బీఐ రీసెర్చ్ సూచించింది. సాధారణంగా విదేశీ కొనుగోలుదారులకు ఎగుమతిదారులు సుమారు ఆరు నెలల వరకు చెల్లింపు గడువు ఇస్తున్నందున, ఆ వ్యవధిలో ఎగుమతుల ఆదాయాన్ని స్వదేశానికి తీసుకురావడానికి అవకాశం కల్పించాలని పేర్కొంది. ఆరు నెలలకు మించి గడువు పొడిగించాల్సి వస్తే ప్రతి కేసును విడిగా పరిశీలించి అనుమతించాలని తెలిపింది.

పన్నులపై స్పష్టత అవసరం

విదేశీ వాణిజ్య లావాదేవీలకు సంబంధించిన బాహ్య వాణిజ్య రుణాల (ఈసీబీ)పై విధించే మూలం వద్ద పన్ను (టీడీఎస్) విషయంలోనూ స్పష్టత అవసరమని నివేదిక పేర్కొంది. ప్రస్తుతం ఈ పన్ను 5 నుంచి 20 శాతం వరకు ఉంది. ద్వంద్వ పన్నుల నివారణ ఒప్పందాల (డీటీఏఏ) కింద లభించే ప్రయోజనాలను సక్రమంగా అమలు చేయడంతోపాటు, పన్ను నిబంధనలను అధికారులు ఏకరీతిగా వర్తింపజేసేలా చర్యలు తీసుకోవాలని సూచించింది. ఈ మార్పులు విదేశీ పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచి, దేశ బాహ్య ఆర్థిక స్థిరత్వాన్ని బలోపేతం చేయగలవని ఎస్‌బీఐ రీసెర్చ్ అభిప్రాయపడింది.

సంప్రదాయ ఐటీ సేవల వృద్ధికి ఏఐ సవాల్!

- కొత్త సాంకేతికతలతో పాత సేవల క్షీణతకు అడ్డుకట్ట
- భవిష్యత్తు నియామకాల్లో 80శాతం డిజిటల్, ఏఐ నిపుణులే
- 3 బిలియన్ డాలర్లు దాటిన ఏఐ వార్షిక ఆదాయం
- టీసీఎస్ సీఈఓ కృతివాసన్

న్యూఢిల్లీ: కృత్రిమ మేధ (ఏఐ) విస్తరణతో ఐటీ రంగంలో సంప్రదాయ సేవల వృద్ధి మందగించే అవకాశముందని టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) సీఈఓ కృతివాసన్ అభిప్రాయపడ్డారు. టెక్నాలజీ సంస్థలు ఏఐ, ఇతర అధునాతన సేవలపై భారీగా పెట్టుబడులు పెడుతున్నాయని, ఇది టీసీఎస్ సహా ఐటీ కంపెనీల వృద్ధి నమూనాలో నిర్మాణాత్మక మార్పునకు సంకేతమని పేర్కొన్నారు. సంప్రదాయ సేవల్లో వృద్ధి తగ్గినా, ఏఐ ఆధారిత సేవలు, కొత్త సాంకేతిక పరిష్కారాల ద్వారా ఆ లోటును భర్తీ చేయవచ్చని వివరించారు. ప్రపంచవ్యాప్తంగా భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతలు, సుంకాలు, స్థూల ఆర్థిక అనిశ్చితి కొనసాగుతున్నప్పటికీ టెక్నాలజీపై పెట్టుబడులు పెట్టేందుకు సంస్థలు ఆసక్తి చూపుతున్నాయని కృతివాసన్ తెలిపారు. ద్రవ్యోల్బణం, పెరుగుతున్న వ్యయాలతో కొన్ని రంగాలు ఒత్తిడిని ఎదుర్కొంటున్నా.. ఏఐ విషయంలో మాత్రం కంపెనీలు వెనక్కి తగ్గడం లేదన్నారు. గత ఆరు నెలలుగా వినియోగదారులు సైతం ఆర్థిక అనిశ్చితి కంటే ఏఐ అందించే అవకాశాలపైనే ఎక్కువగా దృష్టి సారిస్తున్నారని పేర్కొన్నారు.

ఏఐ వల్ల ఉద్యోగ అవకాశాలు తగ్గుతాయన్న ఆందోళనలను టీసీఎస్ సీఓఓ ఆర్తి సుబ్రమణియన్ తోసిపుచ్చారు. ఉద్యోగుల సంఖ్యను తగ్గించే సాధనంగా కాకుండా.. వారి పనితీరును మెరుగుపరిచి, ఉత్పాదకతను పెంచే సాంకేతికతగా ఏఐని చూడాలని సూచించారు. ఉద్యోగులను తగ్గించడానికి బదులుగా, వారి నైపుణ్యాలను వినియోగించుకుని కొత్త కస్టమర్ ప్రాజెక్టులను చేపట్టే దిశగా సంస్థ ప్రణాళికలు రూపొందిస్తోందని వివరించారు. భవిష్యత్తులో టీసీఎస్ చేపట్టే కొత్త నియామకాల్లో 80 శాతం వరకు డిజిటల్, కృత్రిమ మేధ నైపుణ్యాలు కలిగిన అభ్యర్థులకే ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు ఆర్తి సుబ్రమణియన్ తెలిపారు. ఇందుకు అవసరమైన ప్రతిభావంతులు మార్కెట్లో అందుబాటులో ఉన్నారని పేర్కొన్నారు. కొత్తగా ఉద్యోగాల్లో చేరే ఫ్రెషర్లతో పాటు, కొత్త సాంకేతికతలను నేర్చుకునేందుకు ఆసక్తి చూపే అనుభవజ్ఞులకూ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. ప్రత్యేక నైపుణ్యాలు కలిగిన ప్రతిభావంతులపై భవిష్యత్తులోనూ పెట్టుబడులు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. మరోవైపు, టీసీఎస్ వార్షిక ఏఐ ఆదాయం 3 బిలియన్ డాలర్లను దాటింది. సంస్థ మొత్తం వ్యాపారంలో ఏఐ సేవల వాటా పదో వంతుకు మించడం ఈ రంగంలో పెరుగుతున్న ప్రాధాన్యాన్ని సూచిస్తోంది.

ఇండిగోలోకి మరో 6ఎక్స్ఎల్ఆర్ విమానాలు!

- 2027 మార్చి నాటికి 9–10 విమానాలు
- మధ్యదూర మార్గాల్లో సేవల విస్తరణ



న్యూఢిల్లీ: విమానయాన సంస్థ ఇండిగో వచ్చే ఏడాది మార్చి నాటికి తన విమానాల సముదాయంలో 9 నుంచి 10 ఏ321 ఎక్స్ఎల్ఆర్ విమానాలను చేర్చుకోనుంది. ప్రస్తుతం సంస్థ వద్ద నాలుగు విమానాలు ఉన్నాయి. వీటిని మధ్యదూర మార్గాల్లో నడపనున్నట్లు ఇండిగో చీఫ్ స్ట్రాటజీ ఆఫీసర్ అలోక్ సింగ్ సోమవారం తెలిపారు. దేశంలో ప్రీమియం విమాన ప్రయాణ సేవలకు ఆదరణ పెరుగుతోందని, దేశీయ, స్వల్పదూర అంతర్జాతీయ మార్గాల్లో బిజినెస్ క్లాస్ సీట్లను పెంచే దిశగా సంస్థ అడుగులు వేస్తోందని చెప్పారు. కొత్త విమానాలతో మరిన్ని మధ్యదూర మార్గాల్లో సేవలు ప్రారంభించే అవకాశం ఉంటుందన్నారు. భారత విమానయాన రంగంలో ద్వితీయ, తృతీయ శ్రేణి పట్టణాలే వృద్ధికి ప్రధాన కేంద్రాలుగా మారుతున్నాయని పేర్కొన్నారు. 2025–26లో దేశీయ విమాన ప్రయాణికుల సంఖ్య 34 కోట్లకు చేరగా, 2040 నాటికి 110 కోట్లకు పెరుగుతుందని అంచనా.

నవంబర్ 5న 'రామాయణం'

తొలి భాగం విడుదల



బాలీవుడ్ ప్రముఖ దర్శకుడు నితీష్ తివారీ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న భారీ పౌరాణిక చిత్రం 'రామాయణ' విడుదలపై చిత్రబృందం కీలక ప్రకటన చేసింది. ఇప్పటికే ఈ సినిమా నుంచి వెలువడిన అప్‌డేట్‌లు ప్రేక్షకుల్లో భారీ అంచనాలను పెంచగా, తాజాగా నవరాత్రుల శుభ సందర్భంగా విడుదల తేదీని ప్రకటిస్తూ కొత్త పోస్టర్‌ను పంచుకుంది. నిర్మాత నమిత్ మల్హోత్రా రూపొందిస్తున్న 'రామాయణం–పార్ట్ 1' నవంబర్ 5 నుంచి ప్రపంచవ్యాప్తంగా అన్ని ప్రీమియం ఫార్మాట్లలోని థియేటర్లలో విడుదల కానుందని వెల్లడించింది. అలాగే దసరా పండుగ సందర్భంగా ఈ సినిమా ముందస్తు టికెట్ బుకింగ్‌లు ప్రారంభం కానున్నట్లు ప్రకటించింది. 'నవరాత్రుల శుభ సమయంలో నూతన యుగ ఆవిర్భావానికి వేదికవుతున్నాం. ఇది శ్రీరాముని యుగారంభం' అనే సందేశంతో విడుదల చేసిన పోస్టర్ సినీ అభిమానులను ఆకట్టుకుంటోంది. ఇందులో రావణుడి పాత్రలో యశ్ భీకరమైన రూపంలో కనిపిస్తుండ గా, రాముడిగా రణబీర్ కపూర్, సీతగా సాయిపల్లవి దర్శనమిచ్చా రు. ప్రధాన పాత్రధారుల లుక్స్ సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతున్నా యి. ఈ చిత్రంలో కాజల్ అగర్వాల్ మండోదరిగా, రకుల్ ప్రీత్ సింగ్ శూర్పణఖగా కీలక పాత్రల్లో కనిపించనున్నారు. భారతీయ ఇతిహాసమైన రామాయణం ఆధారంగా భారీ స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రాన్ని రెండు భాగాలుగా ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నారు. తొలి భాగాన్ని నవంబర్ 5న విడుదల చేయనుండగా, రెండో భాగాన్ని వచ్చే ఏడాది దీపావళి సందర్భంగా థియేటర్లలో విడుదల చేయాలని చిత్రబృందం ప్రణాళిక సిద్ధం చేసింది. భారీ తారాగణం, అత్యున్నత సాంకేతిక ప్రమాణాలు, పౌరాణిక నేపథ్యంతో తెరకెక్కుతున్న ఈ చిత్రం కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురు చూస్తు న్నారు. తాజా గా విడుదల తేదీ ప్రకటనతో పాటు ప్రధాన పాత్రల రూపాలను పరిచయం చేయడంతో 'రామాయణ'పై అంచనాలు మరింత పెరిగాయి.


ఇమ్రాన్ ఖాన్ సరసన భూమి పెడ్నేకర్

బాలీవుడ్‌లో విభిన్నమైన కథలు, విలక్షణమైన పాత్రలను ఎంచుకుంటూ తనదైన నటనతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి భూమి పెడ్నేకర్ మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రాబోతున్నట్లు తెలుస్తోంది. ఇమ్రాన్ ఖాన్ కథానాయకుడిగా నటిస్తున్న రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'అధురే హమ్ అధురే తుమ్'లో ఆమె కథానాయికగా కనిపించనున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. వైవిధ్యమైన కథాంశాలతో తనకంటూ ప్రత్యేక స్థానం సంపాదించుకున్న భూమి, ఈ చిత్రంలో తన నటనతో మరోసారి ఆకట్టుకోనున్నారని సమాచారం. మరోవైపు, 'కభీ కభీ అదితి జిందగీ మే..' పాటతో యువత మనసుల్లో చెరగని ముద్ర వేసుకున్న ఇమ్రాన్ ఖాన్ చాలా కాలం తర్వాత ప్రధాన పాత్రలో నటిస్తుండటంతో ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. ఇమ్రాన్, భూమి కలయిక తెరపై కొత్త అనుభూతిని అందించనుందని బాలీవుడ్ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఈ చిత్రంలో గుర్భతే పీర్జాద కీలక పాత్రలో నటిస్తుండగా, దానిష్ అస్లామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇంతకుముందు ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ నిర్మించిన 'హ్యాపీ పటేల్: ఖతర్నాక్ జసూస్' చిత్రంలో అతిథి పాత్రలో కనిపించిన ఇమ్రాన్ ఖాన్, ఇప్పుడు ఈ రొమాంటిక్ ఎంటర్‌టైనర్‌తో పూర్తిస్థాయి కథానాయకుడిగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఈ సినిమాను డిసెంబర్ 18న నేరుగా ఓటీటీ వేదికపై విడుదల చేయనున్నట్లు సమాచారం. అయితే విడుదల తేదీ, ఓటీటీ వేదిక, నటీనటుల వివరాలపై చిత్రబృందం నుంచి అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది. ఇమ్రాన్ ఖాన్ పునరాగమనం, భూమి పెడ్నేకర్ నటన, దానిష్ అస్లామ్ దర్శకత్వం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణలుగా నిలవనున్నాయని సినీ అభిమానులు భావిస్తున్నారు.



కంబ్యాక్‌కు వైష్ణవ్ తేజ్ మాస్టర్ ప్లాన్

మెగా హీరో వైష్ణవ్ తేజ్ 'ఉప్పెన' సినిమాతో వెండితెరకు పరిచయమై తొలి చిత్రంతోనే బ్లాక్‌బస్టర్ విజయాన్ని అందుకున్నారు. అయితే ఆ తర్వాత ఆయన నటించిన సినిమాలు ఆశించిన స్థాయిలో విజయాలు సాధించలేకపోయాయి. వరుస పరాజయాల నేపథ్యంలో గత మూడేళ్లుగా టాలీవుడ్‌లో పెద్దగా కనిపించని ఈ యువ హీరో, ఇప్పుడు తిరిగి తన సత్తా చాటేందుకు సిద్ధమవుతున్నట్లు సినీ వర్గాల్లో ప్రచారం జరుగుతోంది. ఒకేసారి మూడు ఆసక్తికరమైన ప్రాజెక్టులను పట్టాలెక్కించే దిశగా అడుగులు వేస్తున్నారనే వార్తలు అభిమానుల్లో ఉత్సాహాన్ని



నింపుతున్నాయి. తాజా సమాచారం ప్రకారం, నూతన దర్శకుడు మహేశ్ దర్శకత్వంలో వైష్ణవ్ తేజ్ ఓ సినిమా చేయనున్నట్లు సామాజిక మాధ్యమాల్లో ప్రచారం సాగుతోంది. ప్రముఖ నిర్మాత అనిల్ సుంకర ఆధ్వర్యంలోని ఏకే ఎంటర్‌టైన్‌మెంట్స్ సంస్థ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మించనున్నట్లు సమాచారం. ఈ కాంబినేషన్ కార్యరూపం దాల్చితే వైష్ణవ్ తేజ్ తదుపరి ప్రయాణంలో కీలకమైన ప్రాజెక్టుగా నిలిచే అవకాశం ఉంది. ఈ సినిమాతో పాటు మరో ఇద్దరు దర్శకులతోనూ ఆయన చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

చిన్నారుల కోసం సల్మాన్ ఖాన్ ప్రత్యేక యూట్యూబ్ చానల్

బాలీవుడ్ అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్ ఒకవైపు వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తూనే, మరోవైపు బుల్లితెరపై 'బిగ్‌బాస్' వంటి ప్రముఖ రియాలిటీ షోలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ బిజీగా గడుపుతున్నారు. అయితే తాజాగా ఆయన చిన్నారులను దృష్టిలో ఉంచుకుని ఓ ప్రత్యేకమైన యూట్యూబ్ చానల్‌ను ప్రారంభించి అందరి దృష్టిని ఆకర్షిస్తున్నారు. 'బీయింగ్ సల్మాన్ ఖాన్' పేరుతో అందుబాటులోకి తీసుకొచ్చిన ఈ చానల్ ముఖ్య ఉద్దేశాన్ని ఆయన ఓ సామాజిక మాధ్యమ పోస్టు ద్వారా వెల్లడించారు. ఈ చానల్ పెద్దల కోసం కాదని, ప్రత్యేకంగా చిన్నారులను దృష్టిలో పెట్టుకుని రూపొందించినట్లు స్పష్టం చేశారు. తన కొత్త చానల్‌ను ఆదరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఇందులోని



అంశాలు పెద్దవారికి అంతగా నచ్చకపోవచ్చని పేర్కొంటూనే, పిల్లలకు వినోదంతో పాటు ప్రేమాభిమానాలు, కుటుంబ బంధాల విలువలు, సరైన విద్య కూడా అవసరమని వివరించారు. చిన్నారుల వయసుకు తగినట్లుగా, వారి మానసిక వికాసానికి తోడ్పడే కంటెంట్‌ను మాత్రమే ఈ వేదికపై అందించాలన్నది తన ఉద్దేశమని తెలిపారు. వినోదం ద్వారా పిల్లలకు ఉపయోగకరమైన విషయాలను చేరువ చేయడమే ఈ చానల్ లక్ష్యమని ఆయన వ్యాఖ్యల ద్వారా స్పష్టమవుతోంది.

దర్శకుడిగా కిరణ్ అబ్బవరం



విభిన్నమైన కథలు, వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకున్న యువ కథానాయకుడు కిరణ్ అబ్బవరం ఇప్పుడు మరో కొత్త ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. వరుస సినిమాలతో బిజీగా ఉంటూనే నటుడిగా, నిర్మాతగా తన ప్రతిభను చాటుకుంటున్న ఆయన, తాజాగా దర్శకుడిగానూ ప్రేక్షకుల ముందుకు రాబోతున్నారు. 'రియాలిటీ' అనే చిత్రంతో మెగాఫోన్ పట్టనున్న కిరణ్, 'గువ్వలచెరువు ఘాట్' వెబ్ సిరీస్‌తో ఓటీటీ రంగంలోకి కూడా



అడుగుపెడుతున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తన కెరీర్, గత చిత్రాల అనుభవాలు, రాబోయే ప్రాజెక్టుల గురించి ఆసక్తికర విషయాలను వెల్లడించారు. నేటి సమాజంలో మధ్యతరగతి యువత పెళ్లి విషయంలో ఎదుర్కొం టున్న ఒత్తిళ్ల నేపథ్యంలో 'రియాలిటీ' కథ సాగుతుందని కిరణ్ తెలిపారు. వివాహం చేసుకోవాలని భావించే ఓ యువకుడి జీవితంలో ఎదురయ్యే సరదా సంఘటనలను వినోదాత్మకంగా ఈ చిత్రంలో చూపించనున్నట్లు చెప్పారు. ఈ సినిమాకు నటనతో పాటు దర్శకత్వం, రచన బాధ్యతలను కూడా తానే చేపడుతున్నట్లు వెల్లడించారు. గత అనుభవాలను గుర్తుచేసుకుంటూ 2023లో విడుదలైన 'మీటర్' చిత్రం ఆశించిన ఆదరణ పొందకపోవడం తనకు కీలకమైన పాఠాన్ని నేర్పిందని అంగీకరించారు. అందుకే ప్రస్తుతం తాను ఎంచుకుంటున్న కథలు, చేయబోయే సినిమాల విషయంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తున్నట్లు వివరించారు.

'రణబాలి' డబ్బింగ్ వెర్షన్ల విడుదల వాయిదా

రౌడీ హీరో విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంటగా నటిస్తున్న పీరియాడికల్ యాక్షన్ డ్రామా 'రణబాలి' విడుదలపై చిత్రబృందం కీలక ప్రకటన చేసింది. దర్శకుడు రాహుల్ సంకృత్యాన్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రానికి అజయ్–అతుల్ సంగీతం అందిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, ప్రత్యంగిరి సినిమాస్ సంస్థలు భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే ప్రేక్షకుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో విడుదలకు సంబంధించిన తాజా నిర్ణయం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. అక్టోబర్ 16న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రం విదేశాల్లో తొలిరోజు కేవలం అసలు తెలుగు వెర్షన్‌లోనే ప్రదర్శితం కానుందని చిత్రబృందం సామాజిక మాధ్యమాల వేదికగా వెల్లడించినట్లు సమాచారం. ఇతర భాషల్లో రూపొందిస్తున్న డబ్బింగ్ వెర్షన్లకు సంబంధించిన పనులు పూర్తి కావడంలో కొంత ఆలస్యం జరగడమే ఇందుకు కారణమని తెలుస్తోంది. దీంతో తెలుగు



మినహా ఇతర భాషల వెర్షన్ల విడుదలను వారం రోజులపాటు వాయిదా వేసి, అక్టోబర్ 23న ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించినట్లు ప్రచారం జరుగుతోంది. విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న జంట, రాహుల్ సంకృత్యాన్ దర్శకత్వం, అజయ్–అతుల్ సంగీతం ఈ చిత్రంపై ఆసక్తిని పెంచుతున్నాయి. డబ్బింగ్ వెర్షన్ల విడుదలలో ఆలస్యం జరిగినప్పటికీ, తెలుగు వెర్షన్‌కు లభిస్తున్న స్పందనతో చిత్రబృందం ఆశలు పెట్టుకుంది. అయితే ఇతర భాషల వెర్షన్ల విడుదల తేదీపై అధికారిక స్పష్టతను బట్టి అభిమానుల ఎదురుచూపులకు తెరపడనుంది.

టెలివిజన్ రంగంతో పాటు పలు దక్షిణాది చిత్రాల్లో నటించి గుర్తింపు తెచ్చుకున్న నటి నీతి టేలర్ తన కెరీర్ ప్రారంభంలో ఎదుర్కొన్న చేదు అనుభవాలను తాజాగా వెల్లడించారు. ఓ దక్షిణాది దర్శకుడు తనతో అసభ్యకరంగా మాట్లాడటమే కాకుండా, రెండో సినిమాలో అవకాశం ఇవ్వాలంటే తనతో లైంగిక సంబంధం పెట్టుకోవాలని డిమాండ్ చేశాడంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఈ విషయానికి సంబంధించిన వీడియోలు ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారమవుతున్నాయి. తనకు ఎదురైన అనుభవాన్ని గుర్తుచేసుకుంటూ నీతి టేలర్ అప్పటి పరిస్థితులను వివరించారు. దక్షిణాది చిత్ర పరిశ్రమలో తాను కేవలం రెండు సినిమాల్లో మాత్రమే నటించానని చెప్పిన ఆమె, మొదటి సినిమా పూర్తయిన తర్వాత అదే దర్శకుడు రెండో ప్రాజెక్టు కోసం ఫోన్ ద్వారా తనను సంప్రదించినట్లు తెలిపారు. అయితే సినిమా అవకాశం గురించి మాట్లాడాల్సిన ఆ ఫోన్ సంభాషణలో దర్శకుడు వ్యవహరించిన తీరు తనను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసిందని వెల్లడించారు. రెండో సినిమాలో అవకాశం కావాలంటే తనతో పడుకోవాలని సదరు దర్శకుడు స్పష్టంగా చెప్పినట్లు నీతి టేలర్ ఆరోపించారు. ఆ మాటలు విన్న వెంటనే

కెరీర్ ఆరంభంలో చేదు అనుభవం ఎదురైంది

తనకు ఏం మాట్లాడాలో, ఎలా స్పందించాలో కూడా అర్థం కాలేదని పేర్కొన్నారు. అప్పటికి తాను చిన్న వయసులో ఉండటంతో ఇలాంటి అనుభవాన్ని ఎదుర్కోవడం మరింత ఇబ్బందికరంగా అనిపించిందని తెలిపారు. ఆ సమయంలో తన మనసు పూర్తిగా మొద్దుబారిపోయిందని, ఆ మాటలు విన్న తర్వాత ఎలా స్పందించాలన్న ఆలోచన కూడా రాలేదని గుర్తుచేసుకున్నారు. అంతకుముందు సదరు వ్యక్తి ఇతరులతో కూడా ఇలాగే ప్రవర్తించిన సందర్భాలను చూసినప్పటికీ, తనకు సైతం అలాంటి అనుభవం ఎదురవుతుందని మాత్రం ఊహించలేదని చెప్పారు. ఆ సమయంలో దర్శకుడితో వాదనకు దిగడం లేదా గొడవ పడటం చేయకుండా, వెంటనే అతడి ఫోన్ నంబర్‌ను బ్లాక్ చేసినట్లు వెల్లడించారు. అనంతరం నేరుగా తన తల్లికి ఫోన్ చేసి జరిగిన విషయాన్ని వివరించినట్లు తెలిపారు. ఆ ఘటన తనపై తీవ్ర ప్రభావం చూపిందని, సినిమా అవకాశాల పట్ల తన ఆలోచనా విధానాన్నే మార్చేసిందని నీతి టేలర్ పేర్కొన్నారు.

నవరాత్రి వేళ అమ్మకదిలివచ్చే

మ్యాచో స్టార్ గోపీచంద్, ప్రతిభావంతుడైన దర్శకుడు సంకల్ప్ రెడ్డి కలయికలో తెరకెక్కుతున్న భారీ చిత్రం 'భరతవర్ష: సాగర్ ఆఫ్ ఫుల్' ప్రేక్షకుల్లో ఆసక్తిని పెంచు తోంది. గోపీచంద్ కెరీర్‌లో 33వ చిత్రంగా రూపొందుతున్న ఈ సినిమాలో రీతూ వర్మ కథానాయికగా నటిస్తోంది. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ పతాకంపై ప్రముఖ నిర్మాత శ్రీనివాసా చిట్టూరి అత్యంత ప్రతిష్టాత్మకంగా, భారీ వ్యయంతో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రస్తుతం సినిమా చిత్రీకరణ శరవేగంగా కొనసాగుతోంది. ఇప్పటికే విడుదలైన 'వీర జయధీర' పాట ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని రేకెత్తించగా, తాజాగా చిత్రబృందం రెండో పాటకు



సంబంధించిన అప్‌డేట్‌ను ప్రకటించింది. 'ఈ నవరాత్రికి ఒక శక్తివంతమైన ఆగమనం పండుగ వాతావరణాన్ని సరికొత్తగా ఆవిష్కరించనుంది' అనే ఆసక్తికరమైన వ్యాఖ్యతో కూడిన పోస్టర్‌ను సామాజిక మాధ్యమాల్లో పంచుకుంది. ఈ సినిమాలోని రెండో గీతం 'అమ్మకదిలివచ్చే' లిరికల్ వీడియోను అక్టోబర్ 14న మధ్యాహ్నం 3.52 గంటలకు విడుదల చేయనున్నట్లు అధికారికంగా వెల్లడించింది. నవరాత్రి పర్వదినాల సందర్భంగా ప్రేక్షకులకు ప్రత్యేకమైన సంగీత కానుక అందించేందుకు చిత్రబృందం సిద్ధమైంది. ఈ ప్రకటనతో పాటు విడుదల చేసిన పోస్టర్ కూడా సినిమా మీద అంచనాలను మరింత పెంచుతోంది. గుట్టలు, కొండల మధ్య నుంచి గోపీచంద్, రీతూ వర్మ ఓ చిన్నారి విగ్రహాన్ని ఎత్తుకుని వస్తున్నట్లుగా కనిపిస్తున్న ఈ పోస్టర్ శక్తివంతమైన దృశ్యాలతో ఆకట్టుకుంటోంది. దర్శకుడు సంకల్ప్ రెడ్డి తనదైన చిత్రీకరణ శైలితో, గోపీచంద్ మాస్ లుక్‌తో పాటు దైవిక నేపథ్యాన్ని ప్రతిబింబించేలా రూపొందుతున్న ఈ పాట ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుందని చిత్రవర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటికే తొలి పాటతో ఆసక్తి రేకెత్తించిన ఈ చిత్రం, రెండో గీతం విడుదలతో మరింత చర్చనీయాంశంగా మారనుంది.

Published And Owned By Adula Thirupathi, And Printed By Bommakanti Vinod Kumar, At Vangs Global Technologies Llp, #1-5-431/20/4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri, Telangana - 500010. And Published From D. No.: 8-3-228/157/A/1a, Rehmath Nagar, Jawahar Nagar, Yousufguda, Hyderabad, Telangana - 500045. **Editor: Adula Thirupathi. PRGI Regd No: TGTEL/26/A6187**, Email: Prajanaava@Gmail.Com. Phone No: 99484 33277.